ప్రజాశక్తి

బుధవారం 31 జులై 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్

జిల్లా అభివృద్ధికి

రూ.10 వేల కోట్లు కేటాయించాలి..

- వెనుకబడిన జిల్లాగా చేర్చినట్లు కేంద్ర ప్రభుత్వం గజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలి
- సిపిఎం రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్ల నిధులు కేటాయించాలని, వెనుకబడిన జిల్లాల జాబితాలో ప్రకాశం జిల్లాను చేర్చినట్లు కేంద్ర ప్రభుత్వం గజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని సిపిఎం రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. 'ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా ప్రకటించడమే కాదు...రూ.10 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజి ప్రకటించాలి' అని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సుందరయ్యభవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు జిల్లాల నుంచి మూడు ప్రాంతాలను కలిపి 1970 ఫిబ్రవరి 2న ప్రకాశం జిల్లాను ఏర్పాటు చేశారని చెప్పారు. అప్పటి నుంచి జిల్లా వెనుకబడే ఉందన్నారు. పాలక పక్షాలు ఏవీ కూడా జిల్లా అభివృద్ధికి చిత్తశుద్ధితో వ్యవహరించలేదన్నారు. జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించాలని, జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించాలని సిపిఎం ఆధ్వర్యంలో మూడుసార్లు పాదయాత్రలు చేశామని చెప్పారు. జడ్పీ సమావేశాన్ని ముట్టడించి జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించాలని తీర్మానం చేయించామని ▶ 2లో

కరిగిపోయిన ఇసుక నిల్వలు

- ఇసుక కోసం 100 కిలోమీటర్లు పోవాల్సిందే..
- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్రంలో అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక నూతన విధానాన్ని ఈ నెల మొదటి వారం నుంచి అమలులోకి తెస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఇసుక వనరులను ప్రజలందరికీ అందుబాటులోకి తెచ్చినట్లు జిల్లా అధికారులు ప్రకటించారు. ఇసుక పాత విధానం లోపభూయిష్టంగా ఉన్న నేపథ్యంలో ఇసుక కోసం ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉచిత ఇసుక విధానంలో ప్రజలందరికీ ఇసుకను అందుబాటులోకి తెచ్చినట్లు అట్టహాసంగా ప్రకటించారు. ఈ మేరకు ఎన్నికల ముందు వరకు జెపి వెంచర్స్, జిసికెఎస్ ఏజెన్సీల అధీనంలో జిల్లాలో ఆరు ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద ఉన్న 72,736 మెట్రిక్ టన్నులు ఇసుకను ఈ నెల ఎనిమిదో నుంచి అందుబాటులోకి తెచ్చారు.

బాపట్ల మార్కెట్ యార్డులో 15,450 మెట్రిక్ టన్నులు, వేటపాలెం వద్ద 4,053, అద్దంకి మండలం అనమనమూరులో 10,374, అద్దంకి తిమ్మాయపాలెంలో 5,103, మార్టూరు వద్ద 2,897, కొల్లూరు మండలం జువ్వలపాలెంలో స్టాక్ పాయింట్‌లో 34,859 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి వచ్చింది. అయితే మూడు వారాల్లోనే జిల్లాలోని ఆరు పాయింట్లలో ఉన్న ఇసుక హారతి కర్పూరంలా కరిగిపోయింది. ప్రస్తుతం ఇసుక కోసం పక్క జిల్లాల రేవులకు వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా జిల్లా ఇసుక అవసరాల కోసం అందుబాటులో ఉన్న ప్రాంతం కృష్ణానది పరివాహక ప్రాంతం గుండ్లకమ్మ. అయితే గుండ్లకమ్మ ప్రాంత ఇసుక భవన నిర్మాణాల్లో వాడేంతగా నాణ్యతగా ఉండదని చెబుతున్నారు. అందువల్ల జిల్లా అవసరాల కోసం కృష్ణా నది తీరప్రాంతమే ఇసుకకు దిక్కయింది. జిల్లాలో ఉన్న ఇసుక నిల్వలు అయిపోవడం, కొత్తగా ఇసుక రేవులను గుర్తించడంలో జరిగిన జాప్యం వల్ల ప్రస్తుతం జిల్లాలో ఇసుక అందుబాటులో లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో గుంటూరు జిల్లాలో ఉన్న నాలుగు ఇసుక పాయింట్ల నుంచి వినియోగదారులు తెచ్చుకోవాలని జిల్లా అధికారులు ప్రకటించారు. ఈ మేరకు కొల్లిపరలో 10,239, మున్నంగిలో 1,10,046, తాళ్ళాయిపాలెం వద్ద 3,83,410, లింగాయపాలెం ఇసుక స్టాక్ పాయింట్ వద్ద 2,59,498 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉన్నట్లు ప్రకటించారు. తిరిగి ఇసుక నిల్వలను ఏర్పాటు చేసేందుకు సుమారు ఒక వారం రోజులు సమయం పట్టవచ్చునని ఈ లోపు జిల్లాలోని ఇసుక వినియోగదారులు గుంటూరు జిల్లాలోని స్టాక్ పాయింట్ల వద్ద నుంచి ఇసుకను తెచ్చుకోవాలని ▶ 2లో

మళ్లీ రాజముద్రతో పాసుపుస్తకాలు

- జగన్ బొమ్మ పుస్తకాలను తీసేయడమే..!
- జిల్లాలో 4.78 లక్షల మంది భూయజమానులు, రైతులు
- రీసర్వేలో భారీగా తప్పిదాలు..
- వాటిని సవరిస్తేనే రైతులకు మేలు..

జగన్ ఫొటోతో ఉన్న పాసుపుస్తకం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జగన్ ఫొటోతో ఉన్న పాసుపుస్తకాలను చించేయడమే తరువాయి.. భూయజమానుల అభీష్టానికి విరుద్ధంగానూ.. కేంద్ర మార్గదర్శకాలను వ్యతిరేకంగా గత పాలకులు తీసుకున్న నిర్ణయాలు రైతుల్లో తీవ్ర వ్యతిరేకతకు కారణాలయ్యాయి. కేంద్రం భూములపై రీసర్వేకు ఆదేశించింది. అందుకు కొన్ని నిర్దేశకాలు జారీ చేసింది. వాటిని ఏ మేరకు అమలు చేశారో కూడా స్పష్టత లేదు. ఎందుకంటే భారీగా తప్పిదాలు జరిగాయి. ఇవి ఎలాగో తప్పలేదు. రైతులు ఇప్పటికీ గగ్గోలు పెడుతున్నారు. ఎన్నికల్లో వాటిని రద్దుచేస్తామని చంద్రబాబు ప్రకటించడంతో రైతులు కొంత శాంతించారు. ఇప్పుడు అదే జరిగింది. అప్పటి సిఎం జగన్ ఫొటోతో ముద్రించిన పాసుపుస్తకాలను రద్దు చేశారు. వాటి స్థానంలో రాజముద్రతో కొత్తగా పాసుపుస్తకాలను జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రెవెన్యూ మంత్రి ఆనగాని సత్యప్రసాద్ పుస్తకం నమూనాను కూడా వెల్లడించారు. ఇప్పుడు జారీ చేసిన పుస్తకాలను చించేయడంతో కోట్లాది రూపాయలు వృథా అయ్యాయి. అదంతా ప్రజాధనమే..

పాసుపుస్తకాలపై పార్టీల రంగులు, సిఎం ఫొటోలు వేసుకోవడం తీవ్ర అభ్యంతరాలకు దారితీసింది. తమ భూమికి సంబంధించి ఎవరో ఫొటో ఏమిటనే చర్చ సాగింది. తెలుగుదేశం రైతులు జగన్ ఫొటోను ససేమిరా అన్నారు. దాన్ని ఇంట్లో పెట్టుకోవడానికి కూడా ఇష్టపడలేదు. అందరూ వ్యతిరేకించారు. కొత్తగా పాసుపుస్తకాలు ఇవ్వనున్నారు. జిల్లాలో 4.78 లక్షల మంది భూ యజమానులున్నారు. వీరందరికీ తిరిగి కొత్తగా పాసుపుస్తకాలు ఇవ్వనున్నారు. ఇక జిల్లాలో రీసర్వేలో 829 గ్రామాల్లో భూములకు సంబంధించి సర్వే చేపట్టారు. డ్రోన్‌లను వినియోగించారు. 25,07,775.97 ఎకరాలను సర్వే చేయాలని తేల్చారు. ఇప్పటివరకూ 811 గ్రామాల్లో 24,57,703.14 ఎకరాల్లో డ్రోన్‌ల సాయంతో సర్వే పూర్తిచేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇంకా 32,860 ఎకరాల్లో రీ సర్వే చేయాల్సి ఉంది. ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కా రాలు వంటివి ఉన్నాయి. అయితే కొత్తగా జారీ చేసిన పాసుపుస్తకాల్లో అనేక తప్పిదాలు చోటుచేసుకున్నాయి. ఒక సర్వే నెంబరులో ఉన్న భాగస్వా ముల పేర్లు మొత్తం పాసుపుస్తకాల్లో పెట్టారు. వీటి వల్ల భూ వివాదాలు పెరుగుతాయి. వారంతా భవిష్యత్‌లో హక్కుదారులుగానే చలామణి అవుతారు. గజిబిజిగా చేశారు. చాలా చోట్ల ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై ఇప్పటికీ పరిష్కారం చేయలేదు. కొత్తగా జారీచేసే పాసుపుస్తకాల్లో గతంలో చోటుచేసుకున్న తప్పిదాలను పరిష్కారం చేయాల్సి ఉంది. యథాతదంగా కేవలం పుస్తకాలు ఇస్తే చాలదని రైతులు కోరుతున్నారు. తప్పులు లేని పుస్తకాలు ఇవ్వాలి. హక్కులు కూడా స్పష్టంగా ఉండాలి. హద్దులు, విస్తీర్ణాలు, సర్వేనెంబర్లు తప్పిదాలు వచ్చాయి. వీటన్నింటినీ సరిచేశాకే కొత్త పాసుపుస్తకాలు ఇస్తే రైతులకు మేలు జరుగుతుంది. గ్రామాల్లో రెవెన్యూ రికార్డులను కూడా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. భూ ఆక్రమణలు, కబ్జాలు యథేచ్ఛగా సాగాయి. వాటిపైనా భారీగా ఫిర్యాదులు వచ్చాయి. వాటిని కూడా గ్రామాల్లో పరిష్కారం చేయాల్సిన అవసరం ఉంది. భూ వివాదాలు పూర్తిగా పరిష్కారం చేశాకే పాసుపుస్తకాలు ఇస్తే వివాదాలకు తెరపడుతుంది.

బాపట్ల జిల్లాలో తహశీల్దార్ల బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ ▲ 8లో

త్రిసిఎం శ్లాబుల

ఎగుమతులకు బ్రేక్.!

- రేపటి నుంచి నిలిపివేత
- సిండికేటైన బయ్యర్లు
- రేట్లు సగానికి తగ్గింపు
- గిట్టుబాటు రేటు ఇస్తేనే శ్లాబులు అమ్ముతామంటున్న యజమానులు



ప్రజాశక్తి-చీమకుర్తి

ఎందరికో ఉపాధి ఇస్తున్న త్రిసిఎం గ్రానైట్ కటింగ్ యూనిట్ల యజమానులు బయ్యర్ల చేతిలో చిక్కుకొని ఊపిరాడకున్నారు. బయ్యర్లు సిండికేటై రేట్లు సగానికి తగ్గించి, చెల్లింపులకు నెలల తరబడి తిప్పుతున్నారు. ఇదేమని అడిగితే ఇష్టమైతే ఇవ్వండి.. లేకుంటే మీ ఇష్టమని చెబుతున్నారు. గత్యంతరం లేక యజమానులు ఆగష్టు ఒకటి నుంచి గిట్టుబాటు ధర ఇచ్చేదాకా శ్లాబులు అమ్మమని తెగేసి చెప్పి, కంటైనర్లలో సరుకు ఎత్తడం ఆపేస్తున్నట్లు ప్రకటించారు.

చీమకుర్తి, ఒంగోలు, గుండ్లాపల్లి ప్రాంతాలలో దాదాపు 70 దాకా త్రిసిఎం కట్ చేసే యూనిట్లు ఉన్నాయి. ఆయా ప్రాంతాల నుంచి నెలనెలా 250 కంటైనర్ల మెటీరియల్ విదేశాలకు ఎగుమతి అవుతోంది. త్రిసిఎం మెటీరియల్ నైజీరియా, టర్కి, దుబాయ్, ఇస్తాంబుల్, మర్కట్, వియత్నాం లాంటి అరబ్ దేశాలకు ఎగుమతి అవుతుంది. ఆయా దేశాలలో త్రిసిఎం మెటీరియల్‌ను మెట్లకు వినియోగిస్తారు. ఒంగోలు, చీమకుర్తి, గుండ్లాపల్లి ప్రాంతాలలో మెటీరియల్ కొనుగోలుకు నల్గురైదుగురు బయ్యర్ల హవా సాగుతోంది. గతంలో స్టెప్ రకం అడుగుకు రూ.120 పలికేది. బయ్యర్లు సిండికేట్ అయ్యి ▶ 2లో

కరిగిపోయిన ఇసుక నిల్వలు

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు సూచించారు.

జిల్లా అధికారులు కొద్దిరోజుల్లోనే జిల్లా వాసులకు ఇసుకను అందుబాటులోకి తెస్తామని చెబుతున్నప్పటికీ అది ఇప్పట్లో సాధ్యపడేలా లేదు. జిల్లా సరిహద్దుల్లో ఉన్న కృష్ణానదీ పరివాహక ప్రాంతంలోని జువ్వలపాలెం, గాజులదిన్నె ఇసుకరీచ్‌ల నుంచి లక్షన్నర మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. అయితే ఈ ఇసుక అక్టోబరు తరువాత మాత్రమే అందుబాటులోకి వస్తుందటున్నారు. జిల్లాలోని బట్టిప్రోలు మండలం ఓలేరు వద్ద 45 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది కానీ ప్రభుత్వం నుంచి అనుమతులు రావాలసి ఉంది. ఒకవేళ ఓలేరు రీచ్ ఇసుక అందుబాటులోకి వచ్చినా నెల రోజుల్లోనే అయిపోతుంది. ఒకవేళ ఈ రీచ్‌లు అందుబాటులోకి వచ్చినా సదరు ఇసుకను జిల్లాలో ఎంపిక చేసిన స్టాక్‌పాయింట్లకు తెచ్చి అమ్మకాలు జరుపుతారా.? లేక వినియోగదారులు అక్కడికే వెళ్ళి తెచ్చుకోవాలా.? అనే విషయమై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు. జిల్లాలో మరెక్కడ ఇసుకరీచ్‌లకు అవకాశం లేకపోవడంతో జిల్లా ప్రజలకు ఇసుక కష్టాలు తప్పేలా లేవని భావిస్తున్నారు. జిల్లా వాసులు గుంటూరు జిల్లాలో ఉన్న ఇసుకస్టాక్ పాయింట్ల నుంచి ఇసుక తెచ్చుకోవాలంటే చాలా వ్యయప్రయాసలు పడాల్సి ఉంటుందని చెబుతున్నారు. బాపట్ల జిల్లాలో చీరాల, అద్దంకి ప్రాంతం నుంచి ఇసుక తెచ్చుకోవాలంటే రవాణా ఛార్జీల భారం అధికంగా ఉంటుంది. చీరాల నుంచి తాళ్ళాయిపాలెం 101 కిలోమీటర్లుగా ఉంది. మున్నంగి 91, లింగాయిపాలెం 62, కొల్లిపర 81 కిలోమీటర్లు ఉంది. అంతదూరం వెళ్లి ఇసుక తెచ్చుతేవడం సామాన్యులకు కష్టం అవుతుంది. జిల్లాలో ఇసుక అందుబాటులో లేని క్రమంలో ఇసుకాసురులు విజృభించారు. చీరాల, చినగంజాం, వేటపాలెం,బాపట్ల, కర్లపాలెం ప్రాంతాల్లో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. ప్రభుత్వం మారినా పోలీస్, రెవెన్యూ, సెబ్‌ల్లో పాత అధికారులే ఉన్న క్రమంలో వారి కనుసన్నల్లోనే ఇసుక అక్రమరవాణా జరుగుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం త్వరితంగా జిల్లా అవసరాల మేరకు ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తేవలసి ఉంది.

చిన్న నాసరయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న దృశ్యం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-దర్శి

దర్శి మండలం అబ్బాయిపాలెం గ్రామంలో ఇటీవల ప్రమాదశాత్తు కరెంట్ షాక్‌తో చనిపోయిన వైసిపి కార్యకర్త చిన్ననాసరయ్య, కుటుంబాన్ని దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయం చేశారు. ఆయన వెంట వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కదిరి పార్థసారథిని కలిసిన కెనరా బ్యాంక్ మేనేజర్

ప్రజాశక్తి-సిఎస్‌పురం

సిఎస్‌పురం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల మరియు ఉద్యాన కళాశాలలో సెక్రటరీ, కరస్పాండెంట్ కదిరి పార్థసారథిని మంగళవారం ఆయన కార్యాలయంలో సిఎస్ పురం కెనరా బ్యాంకు మేనేజర్ ఎస్‌కె ఫయాత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్, సర్పంచ్ షేక్ బుజ్జి, గోను చంద్రశేఖర్‌రెడ్డి, కళాశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

రూ.10 వేల కోట్లు కేటాయించాలి

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. కలెక్టరేట్ వద్ద దీక్షలు, ధర్నాలు నిర్వహించారన్నారు. చడం జరిగిందన్నారు. ఈ ఆందోళనల సందర్భంగా సిపిఎం పార్టీ నాయకులను 50 మందిని అరెస్టు చేసి, వారం రోజుల పాటు జైలుకు పంపడం జరిగిందన్నారు. అసెంబ్లీలో, శాసనమండలిలో ఎంఎల్‌సిల సహకారంతో తీర్మానాలు చేయించడం జరిగిందన్నారు. ఇన్ని పోరాటాలు చేస్తే ఇంతకాలానికి కేంద్ర ప్రభుత్వం ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించడం జరిగిందన్నారు. ఈ పరిణామాన్ని తాము స్వాగతిస్తున్నామని చెప్పారు. జిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేరుస్తూ గజిట్ నోటిఫికేషన్ విడుదలచేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని వెలుగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని, రామతీర్థం, పాలేటిపల్లి, సంఘమేశ్వర రిజర్వాయర్‌లను పూర్తి చేయాలని, కనిగిరిలో నిమ్జ్, దొనకొండ పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్ల నిధులు కేటాయిస్తేనే జిల్లా అభివృద్ధి సాధ్యమవుతోందని చెప్పారు. కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ భాగస్వామిగా ఉన్నందున జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా కృషి చేయాలని కోరారు. లేని పక్షంలో ప్రజల పక్షాన వామపక్షాలు, ఇతర ప్రజా సంఘాలను కూడగట్టి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించారు. సమస్యల పరిష్కారానికి పలు తీర్మాణాలను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి సమావేశంలో ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాలను సమావేశంలో పాల్గొన్న వారు ఆమోదించారు. జిల్లా వెనుకబాటు, అందుకు గలకారణాలు, పరిశ్రమలు, ఉపాధి, సాగునీటి ప్రాజెక్టులు, సాగుభూమి, రైతాంగ సమస్యలు, తాగునీటి సమస్యలు, విద్య, వైద్యం, ప్రజారవాణా, పరిపాలన, వివిధ సామాజిక తరగతులు ఎదుర్కొంటున్న సమస్యల మీద సమావేశంలో పాల్గొన్న వారు మాట్లాడారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసి రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సిపిఐ ఎంఎల్ నాయకురాలు లలితకుమారి, సంయుక్త కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షులు చుండూరి రంగారావు, లోక్‌సత్తా జిల్లా నాయకులు షేక్ రఫీ, ఇండియన్ లేబర్ పార్టీ నాయకులు సుందరం, సిపిఎంఎల్ రెడ్ స్టార్ నాయకులు సుబ్బారావు, రిటైర్డ్ డిప్యూటి కలెక్టర్ పేరయ్య, ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ నాయకులు మారెళ్ల సుబ్బారావు సమావేశంలో మాట్లాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎస్‌కె మాబు, ఒంగోలు నగర కార్యదర్శి జి రమేష్, ప్రజా సంఘాల నాయకులు బాలకోటయ్య, వినోద్, ముసలారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు సమావేశానికి స్వాగతం పలికారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు వందన సమర్పణ చేశారు.

త్రిసిఎం శ్లాబుల ఎగుమతులకు బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

రూ.60కు కొనుగోలు చేస్తున్నారు. అదీ మూడు నెలలకు బిల్లులు చెల్లిస్తున్నారు. కొనుగోలు చేసిన వెం టనే డబ్బులు కావాలంటే రూ.56 ఇస్తున్నారు. మెటీరియల్‌ను దొంగ బిల్లులు సృష్టించి మరీ ఎగుమతులు చేస్తూ దోచుకుంటున్నారు. బయ్యర్ల పరిస్థితి మూడు పువ్వులు, ఆరు కాయలులా ఉంది. అసలే అప్పులు చేసి, ఈఎంఐలు, కరెంటు బిల్లులు కట్టలేక కొట్టు మిట్టాడుతున్న యజమానులు యూనిట్లు నడపలేని పరిస్థితికి వచ్చారు. ఈ నేపథ్యంలో మర్రిచెట్లపాలెంలో మూడు ప్రాంతాల యజమానులు సమావేశమై ఆగష్టు 1 నుంచి బయ్యర్లుకు మెటీరియల్ ఇవ్వవద్దని తీర్మానించారు. స్టెప్ రకం మెటీరియల్ అడుగుకు రూ.73, రైజర్ రకం రూ.53 ఇవ్వాలని, బిల్లులు కొనుగోలు జరిపిన వెంటనే చెల్లించాలని, వాయిదా పద్ధతికి స్వస్తి పలకాలని త్రిసిఎం యూనిట్ల యజమానులు డిమాండ్ చేస్తున్నారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ కేంద్రాలు

అద్దె భవనాల్లో మగ్గుతున్న చిన్నారులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

గత ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో జిల్లాలో చాలా అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కొన్నిచోట్ల భవనాలు శిథిలం కావడంతో చిన్నారులతో పాటు సిబ్బందికి నిత్యం అవస్థలు తప్పడం లేదు. ప్రధాన, మినీ కేంద్రాలను కలుపుకొని జిల్లా మొత్తం మీద 2,903 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా అందులో 1,141 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. 611 కేంద్రాలు రెంటు ఫ్రీతో నడుస్తున్నాయి. 1,151 అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. నూతనంగా 878 అంగన్‌వాడీ భవనాలు మంజూరు కాగా అందులో 872 కేంద్రాలకు అనుమతులొచ్చాయి. వీటిలో 49 అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మాణాలు పూర్తి చేసుకోగా మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణాలు నిలిచిపోయి ఉన్నాయి.

యర్రగొండపాలెం ప్రాజెక్టు పరిధిలో..

యర్రగొండపాలెం ప్రాజెక్టు పరిధిలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లోని 13 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. యర్రగొండపాలెం మండలంలోని చెన్నరాయునిపల్లెలో నిర్మాణం పూరైంది. అమానుగుడిపాడులో శ్లాబ్ వరకు పూర్తి చేశారు. చెన్నరాయునిపల్లె, వీరభద్రాపురం, వేగినాటి కోటయ్య నగర్, పుల్లలచెరువు మండలంలోని నిలువురాళ్ల కాలనీ, పుల్లలచెరువు, మల్లాపాలెం ఎస్సీలలో వివిధ దశల్లో నిర్మాణాలు ఆగిపోయాయి. త్రిపురాంతరం మండలంలోని మేడపి ఎస్టీ శ్లాబ్ పూర్తయింది. త్రిపురాంతకం ఎన్ఎస్‌పి, మియంపల్లిలలో వివిధ దశల్లో నిర్మాణాలు ఆగిపోయాయి. బడ్జెట్ ఉన్న వరకు పనులు జరిగాయి. బడ్జెట్ లేని కారణంగా అవి ఇంకా పూర్తి కాలేదు.

సౌకర్యాలు అంతంత మాత్రమే..

అద్దె భవనాలు కావడంతో సౌకర్యాలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. గోడల్లో పగుళ్లు, లోపల, బయట అరుగులు కుంగిపోవడం, విద్యుత్ సక్రమంగా లేకపోవడంతో చిన్నారులు అవస్థలు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించి సౌకర్యాలు కల్పించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అసంపూర్తిగా నిలిచిన నిర్మాణం

ఆరేళ్ల క్రితం నిర్మాణం ప్రారంభించి..

తిరుగురాయుని చెరువులో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణాన్ని ఆరేళ్ల క్రితం ప్రారంభించారు. ఇప్పటి దాకా పూర్తి చేయలేదు. దీంతో చిన్నారులు అవస్థలు పడుతున్నారు. కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. గూడేల్లో సరైన వసతి కలిగిన ఇల్లు దొరకక కాలం గడుపుతున్నారు.

పులిచెర్ల యేగమ్మ, విటిడిఎ ప్రెసిడెంట్, తిరుగురాయునిచెరువు

నిలిచిపోయిన అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణం

దద్దనాలలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం నిలిచిపోయింది. శ్లాబ్ వరకే పూర్తి చేశారు. మిగతా పనులు చేయలేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణకు సరైన భవనం లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యలో నిలిచిపోయిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని వెంటనే పూర్తి చేయాలి.

కె.అంకన్న, విటిడిఎ ప్రెసిడెంట్, దద్దనాల

CHANGE OF NAME

I, **VALLURI VENKATA RAMAIAH,** S/o. Raghavaiah, Aged 49 years, residing at D.No.7-322-2, Sambasiva Nagar, South Bypass Road, Ongole, Prakasam District . I have changed my wife name from **VALLURI PAMEELA** to **VALLURI PRAMEELA** (New Name) **W/o. Venkata Ramaiah,** in my Passport bearing No.G1141297, as per affidavit dated **30/07/2024** before Public Notary, Ongole.

సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

గిద్దలూరు పట్టణ ప్రాథమిక అరోగ్య కేంద్రం నందు సమస్యలు తిష్ట వేసుకు కూర్చున్నాయని, సమస్యల పరిష్కారం కోసం గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి చొరవ చూపాలని పలు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా ఆసుపత్రి లో వాటర్ సప్లయ్ లేక నీటిసమస్య తీవ్రంగా ఉందన్నారు, ప్రస్తుతం ఓపీ లు పెరుగుతున్నందున మందుల కొరత ఉందని కావున మందుల ఇండెంట్ పెంచాల్సిన అవసరం ఉందని, రాత్రి వేళల యందు మందు బాబుల బెడద ఉన్నందున చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆయుష్మాణ్ భారత్ నిధుల ద్వారా నిర్మించిన హాస్పిటల్‌కు వైయస్ఆర్ పేరును మార్చాలని పలు రాజకీయ పార్టీలు నాయకులు డిమాండు చేశారు.

పత్రికా ప్రకటన

06-08-2024(మంగళవారం) తేదీన ఉదయం 11.00 గంటలకు SEB Station, Darsi ఆవరణలో Cr.no:02/2023 మద్యం కేసులో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనములకు (Pulsar Bike bearing no: AP27BF 2408 Honda dream NEO Bike bearing no: AP27BM1191) బహిరంగ వేలం పాట జరుగును. వేలంపాటలో పాల్గొనదలిచినవారు ముందుగా Rs.1000/- అడ్వాన్స్ చెల్లించి పాటలో పాల్గొన వలసినదిగా కోరుచున్నాము. ఎటువంటి నోటీసు లేకుండా వేలంపాట నిలిపివేయు అధికారము డిపార్ట్మెంట్ వారికి కలదు. హెచ్చు పాటదారుడు తాను పాడుకున్న సొమ్ము కు సంబందించి GST 12% ట్యాక్స్ చెల్లించ వలయును.

ఇట్లు,
బి.సుందర రామయ్య,
Inspector,
SEB Station, Darsi.

చినుకు జాడ లేదు.. రైతు చింత తీర లేదు

నియోజకవర్గంలో కరువు ఛాయలు
ఆందోళనలో రైతన్నలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా చినుకుజాడ కనిపించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు సిద్ధం చేసుకుని ఆశగా ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు. పదునైన వర్షాలు లేకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 36,928 హెక్టార్లు. ప్రస్తుతం వ్యవసాయ బోర్ల కింద 2,091 హెక్టార్లలో సాగు చేశారు. కాగా ఇప్పటి వరకు అతి తక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. మేఘాలు తేలిపోవడంతో సాగు చేసిన పంటలు ఎండుముఖం పట్టాయి.

కార్తెలన్నీ ముగిసినా.. జాడలేని చినుకు

కంది, పత్తి, మిరప విత్తుకునేందుకు అనువైన కాలం రోహిణి, మృగశిర, అరుద్ర కార్తెలు. జూన్ 6న మృగశిర కార్తె ప్రారంభమైంది. సకాలంలో వర్షాలు కురిసి ఉంటే రైతన్నలు ఈ పాటికే విత్తుకునేవారు. జూన్ 22న అరుద్ర కార్తె ప్రాంభమైనా తుంపర వర్షాలు కురిశాయే తప్పా పదునైన వర్షం పడలేదు. జులై 6న పునర్వసు కార్తె ప్రారంభమైనా వర్షాలు ముఖం చాటేశాయి. జులై 20న పుష్యమికార్తె ప్రారంభమైంది. అయినా నియోజకవర్గంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల్లో నేటికీ బీడు భూములే కనిపిస్తున్నాయి. తెలంగాణ, కోస్తాంధ్రాలో విపరీతమైన వర్షాలు కురుస్తున్నా ఈ ప్రాంతంలో మాత్రం సరైన వర్షాలు కురవలేదు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో కరువు తీవ్రం అయింది.

నియోజకవర్గంలో సాగు ఇలా..

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 7,719 హెక్టార్లు విస్తీర్ణంలో సాధారణ సాగు చేయగా, 616 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. పుల్లలచెరువు మండలంలో 10,173 హెక్టార్లు సాధారణ సాగు కాగా 229 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. త్రిపురాంతకం మండలంలో 7,980 హెక్టార్లు సాధారణ సాగు కాగా 260 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. పెద్దదోర్నాల మండలంలో 4,751 హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణం కాగా 420 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. పెద్దారవీడు మండలంలో 6,305 హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణం కాగా 500 హెక్టార్లలో వివిధ పంటలు సాగయ్యాయి. సరైన వర్షాలు కురవని కారణంగా నియోజకవర్గం మొత్తం మీద 36,921 హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణం కాగా ఇప్పటి వరకు 2091 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. మిగతా రైతులు తమ భూములను సాగుకు సిద్ధం చేసుకొని వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ కాలం కరిగిపోతున్నా వర్షాలు కురవకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంటలు వేయడానికి సిద్ధం చేసిన పొలం

మబ్బులే తప్ప వాన కురవలేదు

ఐదు ఎకరాల్లో కంది, మూడు ఎకరాల్లో పత్తి పంటలు సాగుచేసేందుకు ఇప్పటికే సేద్యం చేసి సిద్ధం చేసుకున్నాను. ఇప్పటి దాకా రూ.80 వేలు వరకు పెట్టుబడి పెట్టాను. విత్తనాలు తెచ్చుకొని విత్తుకునేందుకు సిద్ధంగా ఉన్నాను. అయితే పదునైన వర్షం కురవకపోవడంతో పంటలు సాగు చేయలేదు.

- వడితే బాలు నాయక్, రైతు, పాతచెరువు తాండా

రూ. 50 వేలు ఖర్చు చేసి ఎదురుచూస్తున్నా

ఏటా ఖరీఫ్ సీజన్‌లో ఐదు ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నాను. ఈసారి భూమి దుక్కి దున్ని సేద్యాలు చేసి విత్తుకునేందుకు సిద్ధం చేసుకున్నాను. ఇప్పటికే రూ.50 వేలు దాకా ఖర్చు పెట్టుకున్నాను. వర్షం కోసం ఎదురు చూస్తున్నాను. సరైన వర్షం కురవకపోతే తీవ్ర నష్టాలు తప్పవు.

- బొడ్డు ఆంజనేయరెడ్డి, రైతు, మురారిపల్లి

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-టంగుటూరు

రైలు నుండి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఒంగోలు జిఆర్‌పి పోలీసులు తెలిపారు. ఈ సంఘటన ఒంగోలు, సూరారెడ్డిపాలెం రైల్వేస్టేషన్‌ల మధ్య మంగళవారం జరిగింది. మృతి చెందిన వ్యక్తికి సుమారు 35 నుండి 40 సంవత్సరాలు ఉంటాయని, ఎరుపు రంగు చొక్కా, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నారని, ఎత్తు షుమారు 5.5 అడుగులు ఉంటాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు జిఆర్‌పి పోలీసు రైటర్ మురళి తెలిపారు. వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు 9440904870 జిఆర్‌పి సిఐ, 9381923900 జిఆర్‌పి రైటర్‌ను సంప్రదించాలని కోరారు.

టీడీపీ సీనియర్ నాయకుడు యూసూబ్ మృతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంనకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఎస్ఎండి యూసూబ్ (65) మృతి చెందారు. ఆయన జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులుగా, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టరుగా, టీడీపీ మైనార్టీ స్టేట్ జనరల్ సెక్రటరీగా పని చేశారు. 40 సంవత్సరాలు పాటు టీడీపీ అభివృద్ధికి యర్రగొండపాలెం నియోజకవర్గంలో విశేష సేవలు అందించారు. ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు. ఆయన మరణ వార్త తెలుసుకొని టీడీపీ నాయకులతో పాటు ఇతర పార్టీల నాయకులు సైతం ఆయనకు సంతాపం తెలియజేసి, ఆయన చేసిన సేవలను కొనియాడారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి -మద్దిపాడు

ముందు వెళుతున్న వాహనాన్ని బైక్ ఢీకొనడంతో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని వెంకట్రాజుపాలెం సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం దైవాలరావూరుకు చెందిన కొప్పోలు అంజయ్య (55) పల్సర్ బైక్‌పై ఒంగోలు నుండి మేదరమిట్ల వైపు వెళ్తున్నాడు. ముందు వెళుతున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొని ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించి మృతుని బంధువులకు సమాచారం అందించారు. మద్దిపాడు ఎస్ఐ వి.మహేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ట్రాక్టర్ కింద పడి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం యర్రగొండపాలెం మండలంలోని కొలుకుల సమీపంలో జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. చిన్నకొలుకుల గ్రామానికి చెందిన గజ్జెల చెన్నయ్య (35) మోటారు సైకిల్‌పై చిన్న కొలుకుల వెళుతుండగా ఎదురుగా వస్తున్న నీళ్ల ట్యాంకర్ ఢీ కొంది. దీంతో ట్రాక్టర్ టైరు కింద చెన్నయ్య పడి అక్కడికక్కడే మృతి చెందాడు. చెన్నయ్యకు భార్య నాగలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. యర్రగొండపాలెం ఏఎస్సై శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి మృతి చెందిన చెన్నయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి జగదీష్ నాయక్

వృద్ధురాలి హత్యకేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - చీరాల

వృద్ధురాలి హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈపూరిపాలెం పోలీస్ స్టేషన్లో జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జగదీష్ నాయక్ వివరాలు వెల్లడించారు. చీరాల మండలం ఈపురిపాలెంలో ఈనెల 23న పిల్లి లలితమ్మ (78) అనే వృద్ధురాలు హత్యకు గురయింది. మృతురాలి కుమార్తె లింగమగుంట దోష వర్జిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్పీ తుషార్ డూడి సంఘటన స్థలాన్ని గతంలో క్షుణ్ణంగా పరిశీలించి అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. తోటవారిపాలెంకు చెందిన పోసా ఆంజనేయులు ఈ హత్యకు పాల్పడినట్లు నిర్ధారించి మంగళవారం వాడరేవు సమీపంలో నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడి నుండి హత్యకు ఉపయోగించిన కత్తి, వాహనము, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఎఎస్పీలు హత్య కేసును త్వరగా చేధించిన సిఐలు, ఎస్సై, సిబ్బందిని, స్పెషల్ బ్రాంచ్ పోలీసులను ప్రత్యేకంగా అభినదించారు.

డాక్టర్ రంగారావుకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - గిద్దలూరు

రోడ్డు ప్రమాదానికి గురై కర్నూలులోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న డాక్టర్ బివి రంగా రావుని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును తెలుసుకొని, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. సంపూర్ణ ఆరోగ్యంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేతో పాటు నాయకులు మార్తాల సుబ్బారెడ్డి, చేరెడ్డి జయరామి రెడ్డి, పిడతల రమేష్ రెడ్డి, మహానంది యాదవ్, మండ్ల శేఖర్, దేశబోయిన వెంకట రాజు ఉన్నారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

జిల్లా ఎస్‌పి దామోదర్
పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

కొత్తపట్నం -ప్రజాశక్తి

నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. కొత్తపట్నం పోలీస్ స్టేషన్, మెరైన్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్లలోని రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను ఆరా తీశారు. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలన్నారు. బీచ్‌లకి యాత్రికులు తరచూ వచ్చే అవకాశం ఉన్నందున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మెరైన్ సిబ్బందికి సూచించారు. ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ చేయాలని, రాత్రి బీట్ల పనితీరును నిరంతర మానిటరింగ్ చేయాలని, అదే విధంగా చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తుల కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, సిబ్బంది తరచు గ్రామాల్లో పర్యటిస్తూ అక్కడి పరిస్థితులపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో మాట్లాడుతూ వారి ఉద్యోగ బాధ్యతలను వివరించి ప్రజలతో ఎలా మెలగాలనే దానిపై పలు సూచనలు చేశారు. పోలీసు స్టేషన్ సిబ్బందికి సంబంధించిన సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ఫిర్యాదులను పరిష్కరించాలని సూచించారు. ఈ తనిఖీలలో ఎస్పీ వెంట కొత్తపట్నం ఎస్సై సాంబశివరావు, సిబ్బంది ఉన్నారు.

కొత్తపట్నం పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌పి దామోదర్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఎస్సై మధుసూదన్ రావు

ప్రజాశక్తి - కొమరోలు

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మదు సూదన్ రావు అన్నారు. మంగళవారం కొమరోలు మండల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మధుసూదన్ రావు మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు అధికమయ్యాయని ప్రజలు మోసపోతున్నారని అన్నారు. ఓటీపీ మోసాలతో పాటు మీరు బంపర్ డ్రా గెలుచుకున్నారని, బహుమతులు గెలుచుకున్నారని, కౌన్ బనేగా కరోడ్పతిలో 25 లక్షలు గెలుచుకున్నారని, వాట్సాప్‌లో వస్తున్న మెసేజ్‌లను చూసి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. ఇటీవల పెట్టుబడుల పేరుతో ప్రముఖ కంపెనీల పేర్లను అడ్డం పెట్టుకొని మోసం చేస్తున్నారని, టెలిగ్రామ్ చానల్స్‌లో పెట్టుబడి పెడితే పెట్టిన పెట్టుబడి కన్నా అధిక మొత్తంలో లాభాలు పొందవచ్చు అని ఆశ చూపిస్తూ వారిని మోసం చేస్తున్నారని హెచ్చరించారు. అలాగే అపరిచిత యాప్ లింకులు ఆధార్ అప్డేట్ వంటి మోసాలు జరుగుతున్నాయన్నారు. కాబట్టి ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలన్నారు. అలాగే ఉద్యోగాలు ఇప్పిస్తామని జరుగుతున్న మోసాలను దృష్టిలో ఉంచుకొని ప్రలోభాలకు లోను కాకుండా ప్రజలు సమన్వయంతో వ్యవహరించాలని ఎస్ఐ మధుసూదన్ రావు ప్రజలకు సూచించారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే 1930 నెంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. 24 గంటల లోపు ఫిర్యాదు చేస్తే మీరు పోగొట్టుకున్న నగదును కోల్పోకుండా ఆన్‌లైన్ నిలుపుదల చేసి తిరిగి నగదు వచ్చేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

బ్యూటీ బాపట్లగా తీర్చిదిద్దుతా

ఎంఎల్ఎ వేగేశన నరేంద్రవర్మ

ప్రజాశక్తి - బాపట్ల

నియోజకవర్గాన్ని బ్యూటీ బాపట్లగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమని శాసన సభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ అన్నారు. కలెక్టర్‌ను ఆయన మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గ అభివృద్ధిపై అనేక అంశాలను చర్చించారు. నియోజకవర్గంలో మూడు సాగునీటి కాలువలు, మురుగు డ్రెయిన్‌లను పరిశీలించామని అన్నారు. పలు చోట్ల కాల్వలకు మరమ్మత్తులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. వీటితోపాటు ఇతర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గత ఐదేళ్లలో బాపట్ల అభివృద్ధిలో వెనుకబడి ఉందని అన్నారు. రానున్న రోజుల్లో మరింతగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు సమకూర్చే అంశాలపై చర్చించారు. వచ్చే ఐదేళ్లలో బాపట్లను మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. బాపట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలంటే నిధులు ప్రామాణికమని తెలిపారు.

కలెక్టర్‌తో ఎంఎల్ఎ నరేంద్ర వర్మ

పట్టణ ప్రజలకు సమృద్ధిగా తాగునీరు

పట్టణ ప్రజలకు ప్రతినిత్యం సమృద్ధిగా తాగునీరు అందించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని మున్సిపల్ అధికారులను కోరారు. పురపాల సంఘ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సుదీర్ఘంగా పట్టణ సమస్యలపై నరేంద్ర వర్మ చర్చించారు. తాగునీటి అవసరాలు తీర్చేందుకు మరో చెరువు ఏర్పాటుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి : కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

తాడివలస శంకర్ 8వ వర్ధంతి సందర్భంగా స్థానిక శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్‌లో పేద ప్రజలకు షుగర్, బిపికి సంబంధించిన వైద్య సేవలు అతి తక్కువ ధరకి అందుబాటులోకి తీసుకొచ్చిన కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను శాసన సభ్యులు కొండయ్య మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అతి తక్కువ ఖర్చులో అందించే విధంగా ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఆపరేషన్లు, ఉచిత వైద్య శిబిరాలు గ్రామాలలో నిర్వహిస్తామని, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తామని తెలిపారు. హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ ప్రతి శనివారం షుగర్ సంబంధించిన నెలరోజుల మందులు, ఓపి కేవలం రూ.399లకు, బీపీకి నెల రోజుల మందులు, ఓపి రూ.199లకు, అవసరమైన వారికి రక్త పరీక్షల్లో 30శాతం రాయితీ, నెలవారీ ఇతర మందులపై 20శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. షుగర్, బీపీ, జ్వరాల స్పెషలిస్ట్ డాక్టర్ నవీన్ కుమార్ వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. వివరాలకు 9000808198, 7897890737 నెంబర్లకు ఫోన్ చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, కొత్తరవపు జనార్ధనరావు, బుర్ల వెంకటరావు, రత్నబాబు, వీరయ్య మాస్టర్, కామాక్షి హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ కొండయ్య

ఉమ్మడి ప్రకాశం అండర్ 19 క్రికెట్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి - మేదరమెట్ల

ఉమ్మడి ప్రకాశం అండర్ 19 క్రికెట్ జట్టును కొరిసపాడు మండలం రావినూతలలో ఆర్ఎస్ఆర్ స్టేడియంలో 16 మందితో మంగళవారం ఎంపిక చేశారు. గత మూడు రోజుల నుండి క్రికెట్ పోటీలు నిర్వహించారు. వీరిలో 16 మంది సభ్యులు గల జట్టును, స్టాండ్ బైగా మరో నలుగురు క్రీడాకారులను ఎంపిక చేశారు. పిడిసిఎ ప్రధాన కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ జట్టు ఎంపిక చేయడం ఆనందంగా ఉందని అన్నారు. క్రికెట్‌కు పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి తమ వంతు ప్రయత్నం చేస్తామని అన్నారు. పిడిసిఎ ఉపాధ్యక్షుడు జవహర్ మాట్లాడుతూ ఈ మూడు రోజులు జరిగిన ఎంపికలో 29మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. వారిలో 16మంది అండర్ 19 జట్టుకు, స్టాండ్ బై సభ్యులుగా నలుగురిని ఎంపిక చేసినట్లు తెలిపారు. క్రికెట్ క్రీడకు పూర్వ వైభవాన్ని తీసుకురావడం కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జివి హనుమంతరావు, కొల్లా మధు, కోచ్ వంశీ, ఎసిఎ కోచ్ సుధాకర్, చంద్రశేఖర్, బాబురావు పాల్గొన్నారు.

అండర్ 19 క్రికెట్ జట్టు

చెకుముకితో విద్యార్థులకు విజ్ఞానం

ప్రజాశక్తి - అద్దంకి

జన విజ్ఞాన వేదిక ద్వారా విద్యార్థులకు అవసరమైన విజ్ఞాన భాండాగారాన్ని పుస్తక రూపంలో అందించడం శుభ పరిణామమని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు మన్నం త్రిమూర్తులు అన్నారు. మండలంలోని కాకాని వారిపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల నందు సైన్స్ నాలెడ్జి బుల్ చెకుముకి మ్యాగజైన్లను ఒక సంవత్సరం పాటు ప్రతి నెలనెలాలుగు మాస పత్రికలను పాఠశాలకు అందించే విధంగా జిల్లా ఉపాధ్యక్షులు మన్నం త్రిమూర్తులు, జెవివి జిల్లా కార్యదర్శి తంగా శ్రీనివాసరావు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ విధమైన బుక్స్ విద్యార్థిని విద్యార్థులు చదవడం వలన ఉన్నతమైన స్థానాలను అధిరోహించవచ్చని అన్నారు. కార్యక్రమానికి జెడ్‌పిహెచ్ఎస్ హెచ్ఎం ఎన్ఎస్‌హెచ్ గురవయ్య అన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం గురవయ్య మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు జెవివి అందించే సహకారాన్ని అందిపుచ్చుకొని విజ్ఞానాన్ని పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెవివి జిల్లా ఉపాధ్యక్షులు మన్నం త్రిమూర్తులు, కావూరి రఘుచంద్, కృష్ణారెడ్డి, సోము అనురాధ, సంధిరెడ్డి పద్మావతి , వి ఈశ్వరమ్మ, సురేష్ పాల్గొన్నారు.

చెకుముకి మ్యాగజైన్స్ పంపిణీ చేస్తున్న జెవివి నాయకులు

కౌలురైతు కార్డులపై సమీక్షలో తహసీల్దార్ పద్మావతి

కౌలు రైతు గుర్తింపు కార్డులపై సమీక్ష

ప్రజాశక్తి - చెరుకుపల్లి

నిర్దేశిత లక్ష్యాల మేరకు కౌలు రైతు గుర్తింపు కార్డుల పంపిణీ చేయాలని తహశీల్దారు సిహెచ్ పద్మావతి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందితో కౌలు రైతు గుర్తింపు కార్డుల పంపిణీపై సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. వ్యవసాయ అధికారి టి బాలాజీ గంగాధర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ లక్ష్యాలు, కౌలు రైతు గుర్తింపు కార్డుల జారీపై వివరాలు తెలిపారు. నిర్దేశిత లక్ష్యాల మేరకు అన్ని గ్రామాల్లో కార్డులు జారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మండలంలో ఖరీఫ్ సాగుకు సంబంధించి రైతులు ఆయా గ్రామాల రైతు సేవ కేంద్రాల్లో సంప్రదించి పంట నమోదు వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు.

దేవాలయ భూముల కౌలు వేలం నిర్వహిస్తున్న అధికారులు

దేవాలయ భూముల కౌలు వేలం

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని చెరుకూరు శ్రీ త్రిక్రమ ఆగస్తీశ్వర స్వామి దేవస్థానం భూముల కౌలు బహిరంగ వేలం దేవాదాయ శాఖ అధికారులు మంగళవారం ఆలయం ఆవరణలో నిర్వహించారు. 320-17ఎకరాలు, 284-51సెంట్లు భూమికి బహిరంగ వేలం సమక్షంలో ఒంగోలు డివిజన్ ఇన్స్‌పెక్టర్ సిహెచ్ వేణుగోపాలరావు సారధ్యంలో నిర్వహించారు. గత సంవత్సరం రూ.49.84లక్షలు రాగ ఈ సంవత్సరం రూ.53లక్షలు ఆదాయం వచ్చినది. గతం కంటే ఈ సంవత్సరం రూ.3.16లక్షలు అధిక ఆదాయం వచ్చినట్లు ఇఒ ఎం నాగయ్య తెలిపారు. మూడేళ్ల కాల పరిమితికి వేలం నిర్వహించినట్లు తెలిపారు. మిగిలిన 35.66ఎకాల భూమికి వేలం వాయిదా వేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారుల అనుమతితో మరల వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎరువుల దుకాణంలో పరిశీలిస్తున్న అధికారులు

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - కారంచేడు

కారంచేడు గ్రామంలోని ఓ పురుగు మందుల దుకాణంలో వ్యవసాయ అధికారి సుధీర్ బాబు మంగళవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేని రూ.65400 విలువచేసే నిల్వలను గుర్తించారు. వాటిని రైతులకు విక్రయించకూడదని దుకాణ యజమానికి సూచించారు. ప్రభుత్వం నిషేధించిన పురుగు మందులు విక్రయించకూడదని చెప్పారు. పురుగు మందులను ఎంఆర్‌పి రేట్లకే రైతులకు విక్రయించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి విక్రయాలు జరపాలని, ఉల్లంఘిస్తే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువుల బిల్లులు తీసుకోవాలని చెప్పారు.

సిహెచ్‌సిలో రోగులను పలకరిస్తున్న కొండయ్య

సిహెచ్‌సిలో ఎంఎల్ఎ కొండయ్య తనిఖీ

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలను ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వేటపాలెం ఆరోగ్య కేంద్రంలో వరుస వివాదాలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో ఎంఎల్ఎ ఆకస్మిక తనిఖీకి విచ్చేయటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఆరోగ్య కేంద్రంలో రికార్డులు, ఫార్మసిస్ట్ ల్యాబ్ గదిని పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులతో వైద్య సౌకర్యాల పట్ల అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్‌కు అవసరమైన పరికరాల వివరాలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పందలపల్లి ఆరోగ్య కేంద్రాన్నీ తనిఖీ చేశారు. నూతనంగా భవనం నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఎంఎల్ఎ వెంట ఎంపిడిఒ ఎంవిఎస్ శర్మ ఉన్నారు.

విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విజయలక్ష్మికి ఘన సన్మానం

ప్రజాశక్తి - చీరాల

గత 38ఏళ్లుగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయినిగా సేవలందించి ఉద్యోగ విరమణ చేయబోతున్న చిల్లర విజయలక్ష్మిని స్థానిక గోలి సదాశివరావు కళ్యాణ మండపంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. వివి స్పెషల్ మున్సిపల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం పల్లవి అధ్యక్షతన పాఠశాల సిబ్బంది షేక్ జానీబాషా, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉద్యోగ విరమణ అభినందన సభ నిర్వహించారు. విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఎంఇఒ పి సుబ్రహ్మణ్యేశ్వరరావు, పి సుధారాణి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కడవకుదురు జెడ్‌పి హై స్కూల్ హెచ్ఎం కుర్ర రామారావు, ఎఆర్ఎం హై స్కూల్ హెచ్ఎం బి సాల్మన్, కెజిఎంజి హై స్కూల్ హెచ్ఎం టి కృష్ణ మోహనరావు, ఎస్‌విపిఎ యుపి ఎయిడెడ్ స్కూల్ కరస్పాండెంట్ వి ప్రభాకరరావు, పివిఎస్ ఓయుపి ఎయిడెడ్ స్కూల్ కరెస్పాండెంట్ జి అనిల్ కుమార్ రెడ్డి, షేక్ జానీబాషా, ఎస్‌వి సుబ్బారెడ్డి, ఎన్ రాజేష్, ఐ రమాదేవి పాల్గొన్నారు.

వీధి దీపాలే ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

ఎంఎల్ఎ చొరవతో స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని అక్కాయపాలెం పంచాయతీ లక్ష్మీపురం, ఎస్ఎల్ఎస్ కాలనీ నుండి లక్ష్మీపురం వై జంక్షన్ వరకు మంగళవారం స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ జంగిలి వెంకట రామారావు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా స్ట్రీట్ లైట్స్ లేక రాత్రిపూట పాదచారులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ సమస్యను ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే స్పందించి స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ పూర్ణ కుమారి, కర్ర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
5
బుధవారం 31 జులై 2024

చౌక దుకాణాల స్థాయి పెంపుపై పార్లమెంటులో మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని చౌక ధరల దుకాణాల స్థాయి పెంపుపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజాపంపిణీ శాఖ సహాయక మంత్రి నిముబెన్ జయంతి భాయ్ బంభానియ సమాదానమిస్తూ దేశంలో ప్రజా పంపిణీ వ్యవస్థను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి భాధ్యతపై నిర్వహిస్తాయని, సేకరణ, నిల్వ, రవాణా మరియు రాష్ట్రాలకు కేటాయింపు వంటి చర్యలపై భారత ఆహార సంస్థ బాధ్యత తీసుకుంటుందన్నారు. లైసె న్సులు, అర్హత ఉన్న లబ్దిదారుల గుర్తింపు, రేషన్ కార్డుల భీమా, ఆధార సీడింగ్ వంటి అన్ని నిర్వహణ బాధ్యతలను రాష్ట్రాలు తీసుకున్నాయన్నారు. పిఎం ముద్ర యోజన పథకం లో దేశం మొత్తంలో 2023 నవంబర్ 24 నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల ద్వారా 1,15,803 అప్పులను చౌక ధరల దుకాణాల డీలర్లకు, ఆంధ్రప్రదేశ్ లో 14,136 అప్పులు కల్పించామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 29,872 చౌక ధరల దుకాణాలను ఈపోస్ పరి కరంతో ఆటోమాటిక్ తూనికలను కలపడం జరిగిందన్నారు. చౌక ధరల దుకాణాల సామర్ధ్యం మెరుగుపరచుటకు ప్రస్తుతం హైదరాబాద్, ఘజియాబాద్, జైపూర్, అహ్మదా బాద్ పట్టణాలలోని 60 షాపులతో పైలెట్ ప్రాజెక్ట్‌లో అధ్యయనం నిర్వహించబడుతుందన్నారు. మూలధనాన్ని డీలర్లకు అందజేసి ప్రజా పంపిణీకి సంబంధం కాని వస్తువులను టోకుగా అమ్ముకొనే వీలు కలుగుతుందన్నారు. షాపుల డీలర్లకు కొత్త నైపుణ్యాల అభివృద్ధికి ఉపయోగపడే పలు కార్యక్రమాలను రోపొందించటానికి కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ అన్వేషణలు జరుపుతుందని కేంద్ర మంత్రి తెలియజేశారు.

చెంచులకు 'ఉపాధి' దొరికేనా.?

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల మండలంలో చెంచులకు సంబంధించి 1167 జాబ్‌కార్డులున్నాయి. అందుకు గాను 511 మంది కరువు పనులు చేస్తున్నారు. మే నెల నుంచి ఇప్పటి వరకు వీరికి రూ.65 వేలు వేతన బకాయిలు ఉన్నాయి. వ్యవసాయ పనులు సాగక, కరువు పనులు సక్రమంగా లేక చెంచులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూట గడవక పస్తులుంటున్నారు. ఉపాధి పనులు చూపించి ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నారు. గతంలో ఐటిడిఏ ఆధ్వర్యంలో చెంచులకు 180 రోజులు ఉపాధి పనులు కల్పించేవారు. ప్రతినెలా 15 రోజులు ఖచ్చితంగా పని చూపించేవారు. 70 శాతం పని చేస్తే 30 శాతం అదనంగా వేతనం ఇచ్చేవారు. అకౌంట్ల ద్వారా కాకుండా ఉపాధి సిబ్బంది ద్వారా నేరుగా బట్వాడాలు చెల్లించేవారు. అప్పట్లో చెంచులంతా ఉపాధి పనుల మీదనే ఆధారపడి కుటుంబాలను చక్కగా పోషించుకునేవారు.

పనులు లేక పూటగడవని పరిస్థితి

ఉపాధి పనులు ఇప్పుడిలా..

ప్రస్తుతం వంద రోజులు పని మాత్రమే కల్పిస్తున్నారు. అది కూడా కుటుంబం మొత్తానికి కలిసి కల్పిస్తున్నారు. వచ్చే వేతనం కూడా బ్యాంకు ఖాతాలకు జమ చేసేవారు. దీంతో బ్యాంకులకు వెళ్లి డబ్బులు తీసుకోలేక, చేతి నిండా ఉపాధి పని లేక అవస్థలు పడుతున్నారు. ఉపాధి పనుల వల్ల ఉపయోగం లేదంటున్నారు. గతంలో మాదిరిగానే 180 రోజులు ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

చెంచులంటే చిన్నచూపు

నాగమ్మ, ఉపాధి కూలీ, చింతల

చెంచులంటే అధికారులకు, పాలకులకు చిన్న చూపు. తామంతా అడవిలో ఉండేటోళ్లం.. మాకు పూట గడవడమే గగనం. అట్లాంటిది ఉపాధి పనుల విషయంలో కూడా కోతలు పెట్టడం సబబు కాదు.

180 రోజులు పనులు కల్పించాలి

అంజన్న, ఉపాధి కూలీ, మర్రిపాలెం

చెంచులకు ఐటిడిఏ ఆధ్వర్యంలో 180 రోజులు ఉపాధి పనులు కల్పించాలి. గతంలో మాదిరిగానే 70 శాతం పనికి హాజరైతే మరో 30 శాతం కలిపి వేతనం ఇవ్వాలి. బ్యాంకులతో లింకు పెట్టకుండా ఉపాధి సిబ్బంది ద్వారానే వేతనాలివ్వాలి.

నవత ట్రాన్స్‌పోర్టులో తనిఖీ

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

దోర్నాలలోని నవత ట్రాన్స్‌పోర్టును ఏవో జవహర్‌లాల్ నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. తనిఖీలో పురుగు మందులు, విత్తనాలు, ఎరువులకు సంబందించిన బిల్లులను పరిశీలించారు. ఏప డీలర్‌కి గత నెల రోజులు నుండి వచ్చిన సరుకును పరిశీలించారు. రైతులు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులను ఇవ్వాలని చెప్పారు. అలాగే ఈ పీడీసీసీ బ్యాంకు వారికి కూడా మండలంలోని కౌలు రైతుల జాబితాను ఇచ్చి వారికి పంట రుణాలు ఇవ్వాలని మేనేజర్‌కు సూచించారు.

తనిఖీలు చేస్తున్న అధికారులు

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ తిరుమలాదేవి

బాలల అక్రమ రవాణాను నివారించాలి

పాఠశాల ప్రిన్సిపాల్ తిరుమలాదేవి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

బాలల అక్రమ రవాణాను నివారించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం ప్రిన్సిపాల్ తిరుమలాదేవి తెలిపారు. యర్రగొండపాలెంలోని కస్తూర్భా గాంధీ బాలికా విద్యాలయంలో సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ తిరుమలాదేవి మాట్లాడుతూ బాలలకు సంబంధించి అక్రమ రవాణా అంటే దొంగిలించడం లేదా కొనుగోలు చేయటం ద్వారా నెలల వయసులోనే బాలలను సేకరిస్తారని తెలిపారు. బాలికలు ఎక్కువ దోపిడీకి గురవుతున్నారని వివరించారు. ఇలా అక్రమంగా తీసుకొచ్చిన బాలబాలికల ద్వారా అనేక రూపాల్లో ఆర్థిక ప్రయోజనం పొందుతుంటారని పేర్కొన్నారు. ఆర్థిక ప్రయోజనాల రూపాలు అడుక్కునేలా చేయటం, గృహ పనులు, యవ్వనంలో బాలికలతో వ్యభిచారం, బలవంతపు చాకిరి, బాలురతో సంఘ వ్యతిరేక కార్యక్రమాలు, కిడ్నాప్‌లు చేయడం, దొంగ పెళ్లిళ్లు చేయడం జరుగుతోందని వివరించారు. సంపాదన శక్తి లేని వారికి జీవనోపాధి ఆకర్షణ చూపించి మానవ ఆక్రమ రవాణాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బాలల అక్రమ రవాణా గురవుతున్నటువంటి రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నాలుగు స్థానంలో ఉందని వివరించారు. కార్యక్రమంలో ఏఎస్సై మూర్తి, సార్డ్స్ సంస్థ ఏపియం మంది మరియబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బూదాల చిన్నయ్య, సార్డ్ సిబ్బంది మహాలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జంగిల్ ఫారెస్ట్ రైడ్ తాత్కాలిక నిలిపివేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నల్లమల అటవీ ప్రాంతంలోని జంగిల్ ఫారెస్ట్ రైడ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మార్కాపురం డీఎఫ్ఎ విగ్నేష్ అప్పావ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పులుల సంతతికి అనుకూలమైన సమయం కావడంతో ఎన్‌టిసిఎ న్యూఢిల్లీ వారి ఆదేశాల మేరకు ఆగస్టు ఒకటో తేదీ నుంచి మూడు నెలల పాటు జంగిల్ ఫారెస్ట్ రైడ్‌ను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

యువత నైపుణ్యాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక: కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా నైపుణ్యాభివద్ధికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశమందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా నైపుణ్య కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భవిష్యత్ అవసరాలను దష్టిలో ఉంచుకుని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ యాక్షన్ ప్లాన్ ను రూపొందించాలన్నారు. యువత ఆకాంక్షలకు అనుగుణంగా నైపుణ్యాభివద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో డిమాండ్ ఉన్న కోర్సులను గుర్తించాలని పరిశ్రమలు, ఉపాధి, జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ సహా వివిధ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి రవి తేజ, డిఆర్‌డిఎ పీడీ టి. వసుంధర, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాస రావు, స్టెప్ సిఇఒ లోకేశ్వర రావు, మెప్మా పీడీ టి.రవికుమార్, జిల్లా ఉపాధి కల్పనాధికారి భరద్వాజ్, టూరిజం అధికారి బెన్హార్, సాంఘిక సంక్షేమ శాఖ డిడి ఎం. లక్ష్మానాయక్, రూఢ్ సెట్, సీ డాట్, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మార్కా'పుర' 'చైర్మన్'పై..

స్వపక్షంలో తిరుగుబావుటా తప్పదా.?

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాల మురళీక్రిష్ణపై స్వపక్షంలో వ్యతిరేకత నానాటికీ పెరుగుతోంది. స్వపక్ష కౌన్సిలర్లకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అందరినీ కలుపుకుపోతే ఎక్కడ తన ఆదాయానికి గండి పడుతుందనే ఆలోచనతో ఈ విధంగా వ్యవహరిస్తున్నారని స్వపక్షానికి చెందిన వైసిపి కౌన్సిలర్లు బహిరంగంగా వ్యాఖ్యానించడం గమనార్హం. నేడు జరగనన్ను మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి స్వపక్ష కౌన్సిలర్లు డుమ్మా కొడుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అదే జరిగితే కోరం కావడం కూడా కష్టమే.!

మార్కాపురం మున్సిపాలిటీలో 35 వార్డులు ఉండగా... అందులో 30 మంది వైసిపికి చెందిన కౌన్సిలర్లే. తెలుగుదేశం పార్టీకి కేవలం ఐదుగురు మాత్రమే సభ్యులు ఉన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ తొలి నుంచీ ఒకరిద్దరు మినహా మిగిలిన స్వపక్ష కౌన్సిలర్లను పట్టించుకోలేదనే అపవాదు ఉంది. తన ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు మున్సిపాలిటీలో అధికారులంతా పనులు చేయాలనే ఆదేశాలతో ఉక్కిరిబిక్కిరి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎలాగైనా సరే తన ఆర్థిక అవసరాలన్నీ మీరే చూడాలన్నట్లుగా పాలన సాగించారు. కీలకమైన శాఖలోని అధికారులు తమవద్దకు అవసరాల రిత్యా వచ్చిన ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేయడం జరిగింది. ఓ విధంగా చెప్పాలంటే దోపీడి జరుగుతోంది. ఎక్కడ భవనం నిర్మించాలన్నా... అపార్ట్‌మెంట్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలన్నా పెద్ద మొత్తంలో డబ్బు గుంజుతున్నట్లు సమాచారం. కొన్ని ప్రయివేటు వెంచర్లలో నివాసాలు ఏర్పడ్డాయి. అక్కడ రహదారులు, మురుగు కాలువలు అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలన్నా... వెంచర్ నిర్వాహకులు ముడుపులు ఇస్తేనే కౌన్సిల్ అజెండాలో ఆ పనులు ఆమోదం పొందుతాయి. లేకపోతే కౌన్సిల్ అజెండాలో కూడా ఆ పనులకు చోటు దక్కదు. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు కూడా ముందుగా ముడుపులు చెల్లించిన తరువాతనే పనులు ప్రారంభించాల్సి వస్తోంది. ఎక్కడైనా పనులు పూర్తయి... బిల్లులు వచ్చిన తరువాత ఇవాల్సిన పర్సెంటేజి ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఇక్కడ మాత్రం ముందుగా ఇస్తే తప్ప పనులు జరగవనే పేరుంది. మార్కాపురం మున్సిపాలిటీలో ఆయన అక్రమాలకు అడ్డు లేకుండా పోయింది. ఆదాయం వచ్చే మార్గాలన్నీ అన్వేషించడమే ఆయన పనిగా పెట్టుకున్నారు. ఆయన వ్యవహారశైలి నచ్చకనే ఇటీవల జరిగిన ఎన్నికల్లోనూ వైసిపికి మార్కాపురం పట్టణంలో నష్టం జరిగిందనే వాదన ప్రచారంలో ఉంది. స్వపక్షానికి చెందిన ఒకరిద్దరు కౌన్సిలర్లు మినహా మిగిలిన వారంతా చైర్మన్ బాలమురళీక్రిష్ణ పర్వాలేదనే వారు కరువయ్యారు. తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం కూరగాయల మార్కెట్‌ను షాపింగ్ కాంప్లెక్స్‌గా మార్చాలని... అక్కడ వ్యాపారులను ఇబ్బందులకు గురి చేశారు. కూరగాయల వ్యాపారులు దారిలోకి రాకపోవడంతో మార్కెట్ ఆవరణలో చెత్త తొలగింపు నిలిపివేయడం జరిగింది. సుమారు 20 రోజులకు పైగా కంపులో వ్యాపారాలు సాగించారు. మార్కెట్‌కు వచ్చిన జనం కూడా ముక్కు మూసుకుని కొనుగోలు చేయక పత్పలేదు. ఇటీవల జరిగిన ఎన్నికల్లోనూ కూరగాయల మార్కెట్ వ్యాపారులు అంతా ఏకమై చైర్మన్ చిర్లంచెర్ల తీరుకు వ్యతిరేకంగా పనిచేసిన సంగతి తెలిసింది. జనం కూడా కూరగాలయ మార్కెట్ విషయంలో తీసుకున్న చెత్త నిర్ణయాన్ని ఛీ కొట్టారు.

టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత చైర్మన్ చిర్లంచెర్ల చేసిన తప్పులను ఎక్కడ బయటపెడతారోనని ముందుగానే అధికార పార్టీకి సరెండర్ అయినట్లు సమాచారం. తమకు అనుకూలంగా వ్యవహరించకపోతే విచారణ చేపట్టి నీ బండారం బయటపెడతామని ఓ విధమైన బెదిరింపులతో చైర్మన్ చిర్లంచెర్ల తగ్గినట్లు తెలుస్తోంది. స్వపక్ష కౌన్సిలర్లలో పూర్తి వ్యతిరేకతను మూటగట్టుకున్నారు. ఇప్పటి వరకు వైసిపి కౌన్సిలర్లు చాలా మంది సమావేశాలకు సక్రమంగా హాజరు కాలేదు. ప్రతిసారీ ఫోన్‌లో చేసుకుని... ఈ విడత రండి అంటే బ్రతిమాలిన సందార్భాలు ఉన్నాయి. ఇప్పుడు మాత్రం వైసిపికి చెందిన కౌన్సిలర్లు బుధవారం జరిగే కౌన్సిల్ సమావేశానికి డుమ్మా కొడుతున్నట్లు తెలిసింది. అత్యధిక మంది కౌన్సిలర్లు ఈ సమావేశంలో కనిపించకపోవచ్చు. కౌన్సిల్ సమావేశానికి 13 మందితో కోరం అవసరం. టిడిపి సభ్యులు అందరూ వచ్చినా ఐదుగురు మాత్రమే ఉంటారు. నేడు జరిగే కౌన్సిల్ సమావేశం చైర్మన్ బాలమురళీక్రిష్ణపై స్వపక్ష సభ్యులు తిరుగుబావుటా అని ప్రచారం జరుగుతోంది. నేటి కౌన్సిల్ సమావేశం జరుగుతుందో లేదో వేచి చూడాలి మరి.

నేటి కౌన్సిల్ సమాశానికి కోరం కష్టమే.!



ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - పంగులూరు

పంగులూరు పంచాయతీలో పారిశుధ్య పనులు యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నారు. కాలువల్లో మురుగునీరు చేరి దోమలు, ఈగలు పెరిగాయి. వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పంచాయతీ పారిశుధ్య పనులకు శ్రీకారం చుట్టింది. దళిత కాలనీల్లో మురుగు కాలువల్లో మురుగును తొలగిస్తున్నారు.. ఇందుకోసం ప్రత్యేకంగా కూలీలను పెట్టి పారిశుధ్య పనులు చేయిస్తున్నారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్త, సిల్ట్ బయటికి తీసేస్తున్నారు. తరువాత బ్లీచింగ్ పౌడర్ చల్లటం, దోమల నివారణకు సాయంత్రం వేళ్లలో ఫాగింగ్ చేపడతామని సర్పంచ్ గుడిపూడి నాగేంద్రమ్మ తెలిపారు. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని, పారిశుధ్య కమిటీలు గ్రామాల్లో వేయాలని తీర్మానించిన నేపథ్యంలో పారిశుధ్య పనులు వేగవంతం చేశారు. ప్రస్తుతం గ్రామంలో సీజనల్ వ్యాధులు ఉన్నాయి. తాగునీటిని క్లోరినేషన్ చేస్తున్నట్లు తెలిపారు.

అడిఉప్పల్ ఆలయంలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పంగులూరు

సార్వత్రిక ఎన్నికల్లో అద్దంకి తెలుగుదేశం ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీచేసిన గొట్టిపాటి రవికుమార్ 5వ సారి శాసన సభ్యుడుగా గెలుపొందడంతో పాటు మంత్రివర్గంలో స్థానం పొందడంతో మండలంలోని బూదవాడ గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకులు అడిఉప్పల్‌లోని అమ్మవారి దేవాలయంలో మంగళవారం మొక్కు తీర్చుకున్నారు. బూదవాడ గ్రామ తెలుగుదేశం నాయకులు కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి నాయకత్వంలో తెలుగుదేశం కార్యకర్తలు ప్రత్యేక వాహనంలో అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో పిచ్చిరెడ్డి, మురకొండ సుబ్బారావు, గొట్టిపాటి ఖాజాస్వామి పాల్గొన్నారు.

వృక్షాల సంరక్షణతో మేలైన వాతావరణం

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెరువుకొమ్ముపాలెం వాటర్ ట్యాంకు వద్ద మలాది శ్రీనివాసరావు సౌజన్యంతో 18 రకాల పండ్లు, పూలు, నీడ నిచ్చే మొక్కలు మంగళవారం నాటారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షులు వీరయ్య, పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి, అలహరి హరిప్రసాద్ మాట్లాడుతూ చెట్టును పెంచితే మనకు మనుగడ ఉంటుందని అన్నారు. లేకుంటే భవిష్యత్తులో అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. గ్రామంలో చెట్లు నాటే కార్యక్రమం చేపట్టినందుకు అభినందించారు. చెట్ల వల్ల మనకు ఎన్నో రకాలుగా ఉపయోగాలు ఉన్నాయని అన్నారు. చెడు వాయువుని పీల్చి మనకు ప్రాణవాయువైన ఆక్సిజన్ అందిస్తుందని అన్నారు. ఎదిగేకొద్దీ ఒదిగి ఉండమని కూడా చెట్టు మనకు నేర్పుతుందని తెలిపారు. చెట్లును మనం రక్షిస్తే మనల్ని చెట్లు రక్షిస్తాయని అన్నారు. పర్యావరణంలో చెట్లు ఎంతో కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరు మురళి సుధాకరరావు,, మాజీ ప్రెసిడెంట్ చిన్ని మురళీకృష్ణ, రోటరీ సభ్యులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, అళహరి హరిప్రసాదు, కొల్లిపర నాగయ్య, ప్రిన్సిపాల్ రత్తయ్య పాల్గొన్నారు.

మల్లికార్జునరావుకు అభినందనలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

బట్టు మల్లికార్జునరావు

శ్రీ మార్కండేయ పద్మశాలి సేవా సంఘం మండల అధ్యక్షులుగా బట్టు మల్లికార్జునరావును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి సుందరరావు, వై కరుణా శ్రీనివాసరావు అభినందించారు. మల్లికార్జునరావు చేపట్టిన ఈ పదవికి వన్నె తెచ్చే విధంగా పనిచేయాలని కోరారు. చేనేత కార్మికుల అభ్యున్నతికి, సంఘం బలోపేతానికి కృషి చేయాలని కోరారు. మల్లికార్జునరావు మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని అన్నారు. ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జంగం సాంసన్, టిడిపి పట్టణ ఉపాధ్యక్షులు ఇబ్రహీం బేగ్ పాల్గొన్నారు.

ఆచరణలో 'శ్రీమంతుడు' రవికిరణ్

ప్రజాశక్తి - వేమూరు

కొల్లూరు మండలం జువ్వలపాలెం గ్రామానికి చెందిన వేములపల్లి రవి కిరణ్ ఆచరణలో శ్రీమంతుడు సినిమా సన్నివేశాలు అమలు చేసి చూపించారు. రైతు కుటుంబంలో జన్మించిన రవి కిరణ్ గ్రామంలో ప్రాథమిక విద్య, పెసర్లంక డికె ఉన్నత పాఠశాల్లో హైస్కూలు చదువులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణతతో పూర్తి చేశారు. ఆ తర్వాత భాగ్యనగరమైన హైదరాబాద్ చేరారు. అక్కడ చిరు వ్యాపారాన్ని ప్రారంభించారు. అంచలంచెలుగా ఎదిగారు. ఎదుగుదల అంటే తాను మాత్రమే కాదని, తనతో పాటు మరింత మందికి ప్రయోజనం చేకూర్చాలని అనుకున్నారు. గత తొమ్మిదేళ్లుగా జన్మనిచ్చిన తన తల్లిదండ్రులు, జన్మించిన గ్రామానికి ఏదో చేయాలనే దృక్పథంతో అనేక సేవా కార్యక్రమాలను చేపట్టారు. చిరు వ్యాపారంతో ప్రారంభమైన రవి కిరణ్ నేడు దేశం గర్వించదగిన కాంట్రాక్టర్‌గా స్థిరపడ్డారు.

పేద విద్యార్థులను దత్తత తీసుకున్న రవికిరణ్

చదువుల ప్రాధాన్యత తెలిసిన రవికిరణ్ చుట్టుపక్కల గ్రామాల పేద విద్యార్థినీ, విద్యార్థులను దత్తత తీసుకున్నారు. వారిని ఎల్‌కెజి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు చదువులకు అయ్యే ఖర్చులు భరిస్తున్నారు. అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి దేశాలకు వెళ్లి చదువుకోవాలనుకునే పేద విద్యార్థులకు పూర్తి ఖర్చును భరిస్తూ బంగారు బాటలు వేస్తున్నారు. దేశంలో కరోనా సమయంలో ప్రధానమంత్రి విపత్తు నిధికి రూ.38లక్షల విరాళం, జువ్వలపాలెం చుట్టుపక్కల గ్రామాలకు తన సొంత ఖర్చులతో ఎల్ఈడి వీధి దీపాలు ఏర్పాటు చేశారు. మురుగునీటి పారుదల వ్యవస్థకు చర్యలు చేపట్టారు. పోతరులంక ఎత్తిపోతల పథకం కోసం తన ఆర్థిక సహకారాన్ని అందించి రైతు అభివృద్ధికి కారుకులయ్యారు. దేవాలయాల అభివృద్ధికి తన వంతు రూ.కోట్ల సహాయం అందించి భక్తిని చాటుకున్నారు. లంక గ్రామాల విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు అవసరమైన సైకిళ్లు సమకూర్చారు. రు.14.33లక్షలు ఖర్చు చేసి 275మంది విద్యార్థులకు సైకిళ్లను ఉచితంగా అందించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యకర్రమాలు గమనించిన గ్రామప్రజలు రవికిరణ్‌ను నిజమైన శ్రీమంతునిగా అభివర్ణిస్తున్నారు.

విద్యార్థులకు పంపిణీ చేసిన సైకిళ్లు

అగ్నిప్రమాద బాధితునికి నగదు సాయం

ప్రజాశక్తి - కర్లపాలెం

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకునేందుకు సేవా సంస్థలు ముందుకు రావాలని ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ గౌరవాధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు కోరారు. మండలంలోని గణపవరం పంచాయతీ చిన్న పులుగు వారిపాలెంలో సైదబ్‌రెడ్డికి చెందిన పూరిల్లు అర్ధరాత్రి సమయంలో స్టార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగి పూర్తిగా కాలిపోయింది. బాధితులకు ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో నిత్యవసర వస్తువులు, నగదు, కూరగాయలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి బత్తుల సురేష్ మాట్లాడారు. స్టార్ట్ సర్కుట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించి సైదాబ్‌రెడ్డి నివాసం పూర్తిగా అగ్నికి ఆహుతైందని అన్నారు. బాధిత కుటుంబానికి నిత్యవసర వస్తువులు, కూరగాయలు, కొంత నగదు అందజేశారు. బాధితులు నివాసంలో దాచుకున్న రూ.70వేల నగదు తోపాటు, మూడు ఎకరాల గడ్డివామి కూడా దగ్ధమైందని తెలిపారు. మరి కొంతమంది ముందుకు వచ్చి బాధితులకు సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ అధ్యక్షులు బండ్రెడ్డి గోపి, ఉపాధ్యక్షులు మద్దిబోయిన గోపి, ట్రెజరర్ జోగి సువర్ణరాజు, చెల్లి అశోక్ కుమార్, యాసం రాజా రమేష్, విన్నకోట శ్రీనివాసరావు, బండి శ్రీనివాసరావు, కందుల శ్రీకాంత్, నరాలశెట్టి సుబ్బారావు,యార్రం శెట్టి పవన్ కుమార్, రాబర్ట్ వెస్లీ పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఫ్రెండ్స్ యూత్ ఆర్గనైజేషన్

వెదసాగు పొలంలో నీటిని తొలగించాలి

వెద వరిలో సస్యరక్షణ వివరిస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి - వేమూరు

అమర్తలూరు మండలంలోని మోపర్రు, పెదపూడి గ్రామాల్లో గత వారం రోజుల నుంచి కురుస్తున్న అధిక వర్షాల వలన నష్టం పోయిన వెద వరి సాగు పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి వై రామకృష్ణ, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం ఉష, డాక్టర్ ఎన్ కామాక్షి, డాక్టర్ కె మృదుల, బాపట్ల ఉప్పునీటి పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త టి రత్నకుమారి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం వరి మొలక దశలో దెబ్బతిన్నదని, రైతులు అధైర్య పడకుండా త్వరగా మరల సాగు చేయుటకు వరి విత్తనాలు ప్రభుత్వం అందించేందుకు సహాయం చేస్తుందని తెలిపారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ పొలాల్లో నుంచి నీళ్లు బయటకు తీసి ముదురు చేలల్లో ఎకరాకు 20కేజీలు యూరియా చల్లాలని తెలిపారు. 20 -25 రోజుల వెద వరిపైరులో కలుపు నివారణ కొరకు బిస్పెయిరిబాక్ సోడియం (నామిని గోల్డ్) ఎకరాకు 100 ఎంఎల్, ఫినక్సి ప్రోప్‌ఇటైల్ (రైస్ స్టార్) ఎకరాకు 330ఎంఎల్ పిచికారి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ ఉయ్యూరు లోకేశ్వరి, ఎఈఓ ఐ శ్రీకాంత్, వివిఎలు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : ఖరీఫ్ సీజన్లో సాగుచేసిన వెద పైరులో కలుపు నివారణకు చర్యలు చేపట్టాలని రేపల్లె ఎడిఎ ఆర్ విజయబాబు తెలి పారు. వ్యవసాయ అధికారి గొల్లపోతు మీరయ్యతో కలసి క్షేత్ర ప్రర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ వెద సాగు 25రోజులు దాటిన తర్వాత కలుపు నివారణకు నామిని గోల్డ్ ఎకరాకు 80 నుండి100 గ్రాముల మందును పిచికారి చేసుకోవాలని చెప్పారు. ఆల్ మిక్స్ ఎకరాకు 8 గ్రాముల మందులు ఐదు నుండి ఆరు ట్యాంకులు వరకు నీటిలో కలిపి పిచికారి చేసుకోవడం ద్వారా నివారణ చేపట్టవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఎఈఓ స్వప్న, ఎంపిఇఒ నరేష్, వివిఎ రత్నరాజు పాల్గొన్నారు.

నీటిని తొలగించాలని సూచిస్తున్న ఎడిఎ విజయబాబు

వేరుశనగ రైతులతో మాట్లాడుతున్న డిడిఎ విజయనిర్మల

యాజమాన్య పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి - కర్లపాలెం

నేల ద్వారా వ్యాప్తి చెందే కాండం కుళ్ళు, వేరుకుళ్ళు తెగుళ్ళ నివారణకు ట్రైకోడెర్మా పనిచేస్తుందని డిడిఎ విజయనిర్మల తెలిపారు. మండలంలోని యాజలి గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ, బాపట్ల జల వనురుల కేంద్రం ఆధ్వర్యంలో వేరు శనగలో మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 90కిలోల బాగా చిదిగిన పశువుల ఎరువులో 10కిలోల వేప పిండి, రెండు కిలోల ట్రైకోడెర్మా విరిడి బాగా కలిపిన మిశ్రమంపై గోనెసంచి ఉంచాలని, ఆ మిశ్రమాన్ని మూడు రోజులకు ఒకసారి నీరు చల్లుతూ కలుపుకోవాలని చెప్పారు. ఎడిఎ లక్ష్మీ మాట్లాడుతూ పొలంలో నీలిరంగు జిగురు అట్టలు అమర్చుకోవడం వలన రసం పీల్చు పురుగు ద్వారా వ్యాప్తి చెందే మువ్వ కుళ్ళు తెగుళ్ళను నివారించవచ్చని తెలిపారు. ఎడిఎ రత్నకుమారి, ఎఒ సుమంత్ కుమార్, వివిఎ సునీత, గోపి, బాజీ పాల్గొన్నారు.

డ్రైవర్ సుబ్బారావును సన్మానిస్తున్న ఆర్టీసీ అధికారులు

డ్రైవర్ సుబ్బారావుకు ఘన సత్కారం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఇటీవల నెల్లూరులో జోనల్ స్థాయిలో జరిగిన ఆర్టీసీ ఉద్యోగుల క్రీడా పోటీల్లో 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించిన లుక్కా సుబ్బారావును రేపల్లె ఆర్టిసి డిపో మేనేజర్ రాజశేఖర్, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిపోలో మంగళవారం ఏర్పాటు చేసిన సభలో సత్కరించారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన సుబ్బారావుతో పాటు జిల్లాలో మరో ముగ్గురు వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ఇయు జిల్లా కార్యదర్శి వివిఎస్ రావు తెలిపారు. జోనల్ స్థాయిలో ద్వితీయ బహుమతుని సాధించటం గర్వకారణంగా ఉందని డిపో మేనేజరు రాజశేఖర్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అసిస్టెంట్ కార్యదర్శి బిటీ వలి, యూనియన్ సెక్రటరీ పి కమలాకరరావు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - అద్దంకి

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు స్థానిక హర్షిణి డిగ్రీ కళాశాల్లో న్యాయ విజ్ఞాన సదస్సు మంగళవారం నిర్వహించారు. మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రజల హక్కులు, రక్షణలను అతిక్రమించి, వారి అభీష్టానికి వ్యతిరేకంగా పీడించే వారిని కట్టడి చేయడమే మానవ అక్రమ రవాణా దినోత్సవ ఉద్దేశమని న్యాయవాది మహమ్మద్ రఫీ తెలిపారు. న్యాయవాది ఎం ప్రకాష్, హర్షిణి కళాశాల లెక్చరర్ జ్యోతి రమేష్ బాబు పాల్గొన్నారు .

మంత్రి సత్యప్రసాద్‌తో దాసరి హనుమంతరావు గౌడ్

మంత్రి అనగానిని కలిసిన దాసరి

ప్రజాశక్తి - పంగులూరు

రెవిన్యూ, స్టాంప్ డ్యూటీ మినిస్టర్ అనగాని సత్య ప్రసాద్‌కు గౌడ్ సాధికారిక రాష్ట్ర కమిటీ సభ్యులు దాసరి హనుమంతరావు గౌడ్ మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సత్యప్రసాద్ గౌడ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడని హనుమంతరావు తెలిపారు. మంత్రి నేతృత్వంలో గౌడ సంఘం అభివృద్ధి చెందగలదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గౌడ సంఘీయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించగలరన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అద్దంకి నియోజవర్గం తరపున మంత్రి సత్య ప్రసాద్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఏల్చూరు కెజిబివికి ఇన్వర్టర్ బహుకరిస్తున్న దృశ్యం

కెజిబివికి ఇన్వర్టర్ బహూకరణ

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరులోని కస్తూరిబా గాంధీ గురుకుల బాలికల పాఠశాలకు అవసరమైన 300 ఎహెచ్‌ఎస్ సామర్థ్యం కలిగిన ఇన్వర్టర్‌ను పాఠశాల ఎస్‌ఓ శ్రీలక్ష్మికి నామ్ ఎక్స్‌ప్రెస్ హైవే సంస్థ ప్రతినిధులు మంగళవారం అందజేశారు. విలువైన ఇన్వర్టర్‌ను సమకూర్చిన సంస్థ ప్రతినిధులకు ధన్యవాదంలు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ క్యూబ్ హైవేస్ సంస్థ ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడంలో, సామాజిక అభివృద్ధిలో ఎప్పుడు సహకరిస్తుందని అన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు చిరంజీవి, దీపక్, మురళి, నరేందరరెడ్డి పాల్గొన్నారు.

మాయమైన చేతి పంపు

ప్రజాశక్తి - అద్దంకి

గొంతు తడుపుకోవడానికి గుక్కెడ నీళ్ల కరువైన ఈ రోజుల్లో ప్రభుత్వం తాగునీటి కోసం రూ.లక్షలు ఖర్చు పెట్టి నీటి సరఫరా చేస్తుంది. ఈ క్రమంలో పురపాలక సంఘం పరిధిలోని నర్రావారిపాలెంలో బట్టీల బడికి వెళ్లే దారిలో ఒక ఇంటి ముందు ఉన్న చేతి పంపు కొన్నేళ్లుగా మరమ్మతులకు గురైంది. ఇవాళ పురపాలక సంఘ కమిషనర్ ఎం సత్యనారాయణ ఆ ప్రాంతంలో సమస్యలు తెలుసుకుంటున్న క్రమంలో స్థానిక ప్రజలు చేతి పంపును మరమ్మత్తులు చేయించాలని కోరారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరిన వెంటనే అక్కడ పంపు మాయమైంది. మరమ్మ త్తులు చేయడానికి వెళ్లిన సిబ్బంది ఈ ఘటన చూసి అవాక్కయ్యారు. స్థానిక ప్రజలు ఇది ఏమిటని ప్రశ్నిస్తు న్నారు. ఈ ఘటనపై స్థానికులు పురపాలక కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇది ఇలానే కొనసాగితే భవిష్యత్తులో ఎవరి ఇంటి ముందు స్థలాన్ని కూడా రాకపోకలు లేకుండా గోడలు నిర్మించే అవకాశం ఉంది. పురపాలక సంఘ అధికా రులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

గతంలో బోరు ఉన్న ప్రదేశం

వెంపరాలలో ఉచిత పశు వైద్యశిబిరం

ప్రజాశక్తి - అద్దంకి

పశు సంపద ద్వారా రైతులు ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉండగలుగుతారని పశుసంవర్ధక శాఖ రాష్ట్ర ముఖ్య కార్య నిర్వహణ అధికారి ఎం శ్రీనివా సరావు అన్నారు. మండ లంలోని వెంపరాల గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని సహాయ సంచాలకులు ఎం మోహనరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మండలంలో పశుసంపద అధికంగా ఉందని పశు సంవర్ధక శాఖ పూర్తి సహాయ సహకారాలు అందించాలని సర్పంచి వెంకాయమ్మ కోరారు. పశు వైద్య శిబిరంలో దాదాపు 70 గర్భకోశ వ్యాధులు వచ్చిన పశువులకు వైద్యం నిర్వహించారు. మరో 95 ఇతర ఆరోగ్య సమస్యలకు ఉచిత పశు వైద్య సేవలు, 1962 అంబులెన్స్ సిబ్బంది పశు సహాయకులు, గోపాల మిత్రుడు, ఇతర పశు సంవర్ధక శాఖ సిబ్బంది సేవలను అందించారు. కార్యక్రమంలో బొమ్మనంపాడు పశువైద్యులు ఏలూరి అశోక్, పశు వైద్యులు బి వెంకట్రావు, కోనంకి పశు వైద్యులు ఎ క్రాంతి కిరణ్, మెదరమెట్ల పశు వైద్యులు ఎం సైదయ్య, పశు వైద్య శాఖ సిబ్బంది, గ్రామస్తులు పశుపోషకులు పాల్గొన్నారు. ఈ ఉచిత శిబిరంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి ఎం హనుమంతరావు, కార్య నిర్వహణ అధికారి డాక్టర్ బి రవి కుమార్, ఒంగోలు జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ డాక్టర్ ఎం రమేష్ బాబుతోపాటు వెంపరాల సర్పంచి ఎడ్లపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు.

పశుపోషకులకు దాణా అందజేస్తున్న శ్రీనివాసరావు

బాలికలు జాగ్రత్తగా ఉండాలి : జడ్జి ప్రశాంతి

ప్రజాశక్తి - పర్చూరు

మాయమాటలు చెప్పే వారి పట్ల బాలుకలు జాగ్రత్తగా ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి కె ప్రశాంతి అన్నారు. బాలికల అక్రమ రవాణాను అరికట్టాలని అన్నారు. అంతర్జాతీయ మానవ ఆక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేద్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో మంగళవారం జరిగిన సభలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత రోజుల్లో అనేక మంది బాలికలు అక్రమ రవాణాకు గురౌతున్నారని చెప్పారు. డబ్బులు ఇస్తామని, విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామని మాయ మాటలు చెప్పే మోసగాళ్ల మాటలకు మోసపోతున్నారని అన్నారు. అలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. అందరూ బాగా చదువుకొని ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షులు సిహెచ్ శ్రీరమణి, న్యాయవాదులు ధనలక్ష్మి, ప్రిన్సిపాల్ విశ్వవాణి, ఇంచార్జి తహశీల్దారు శ్రీనివాసరావు, అరుణ, సుజాత పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న జడ్జి ఎం ప్రశాంతి

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

ప్రజాశక్తి - వేమూరు

మండలంలోని చావలి పాఠశాలలో కార్తీక్ పౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులు వాకా శివరామకృష్ణ పుట్టిన రోజు వేడుకల సందర్భంగా ఒకటి నుండి ఐదు తరగతుల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పలకలు, పెన్సిళ్ల ఇతర విద్యా సామాగ్రి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నండూరి కార్తీక్ మాట్లాడుతూ ఫౌండేషన్ సభ్యులు శివరామకృష్ణ పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, పలకలు, పెన్నులు పెన్సిళ్లతో పాటు అవసరమైన సామాగ్రిని అందించటం అభినందనీయమని అన్నారు. ఫౌండేషన్ ఏర్పాటు చేసిన నాటి నుండి నిత్యం పేద ప్రజలకు ఏదో ఒక రూపంలో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయురాలు కళ్యాణ లక్ష్మి, ఫౌండేషన్ సభ్యులు ఎస్ రవికుమార్, ఎం చందు, ఎం మోహన్‌సాయి, వి పరమతేజ పాల్గొన్నారు.

పుస్తకాలు అందజేస్తున్న కార్తీక్ పౌండేషన్ సభ్యులు

పొంచి ఉన్న ప్రమాదం.. స్పందించిన ఏలూరి

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని బోడవాడ, రమణాయపాలెం ప్రధాన రహదారి సైడ్ బర్మ్స్ సరిగ్గా లేకపోవడంతో రోడ్డు కోతకు గురై పూర్తిగా దెబ్బతినింది. దీంతో రాత్రి వేళ తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి తోడు చిన్నపాటి వర్షాలకు రోడ్డు పక్కన నీరు నిలవడంతో రోడ్డు కుంగిపోతుంది. ఎదురెదురుగా వాహనాలు వచ్చే సమయంలో రోడ్డు కుంగిపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఈ సమస్య గుర్తించిన స్థానికులు ఎంఎల్‌ఎ ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకువచ్చారు. సమస్యపై స్పందించిన ఎంఎల్‌ఎ ఏలూరి పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని పంచాయతీ రాజ్ ఎఇ పేర్కొన్నారు.

ప్రమాదకరంగా బోడవాడ రహదారి

రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ ఎం ఉష

వరి రకాలపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - పర్చూరు

బాపట్ల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు మండలంలోని చెరుకూరులో వరి రకాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఆర్ బాల మురళీధర్ నాయక్, డాక్టర్ ఎం ఉషా మాట్లాడారు. వరి పంటలో మేలైన రకాలు, వాటి యాజమాన్య పద్ధతులు వివరించారు. వరి పంటలో ఆశించు పురుగులు, తెగుళ్ల నివారణ, యాజమాన్యం పద్ధతులు క్లుప్తంగా వివరించారు. ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్, కౌలు రైతు కార్డుల గురించి వివరించారు. ఎడిఎ ఎన్ మోహనరావు, మాజీ జడ్పిటిసి దాసరి ఉషారాణి, వైస్ ఎంపిపి పాలేరు వీరయ్య, కరగ్‌పూర్ ఐఐటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కారుమంచి విజయకుమార్, చెరుకూరు పంచాయతీ సెక్రటరీ కె సత్యన్నారాయణ, విఎఎ జి నాగబాబు పాల్గొన్నారు.

పెన్షన్ నిధులు మంజూరు

ప్రజాశక్తి - పర్చూరు

ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ స్కీం నిమిత్తం మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలోని పంచాయతీల్లో పించన్ దారులకు పంపిణీ నిమిత్తం ఈనెల 31న రు.3.47కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎంపిడిఒ బి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సచివాలయ సిబ్బందితో పంపిణీకి సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆగష్టు 1న లబ్దిదారుల ఇళ్లవద్దనే పెన్షన్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కొత్తగా పెంచిన రూ.4వేలు లబ్దిదారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. వృద్ధాప్య, వితంతు, చేనేత, కల్లుగీత, మత్స్యకార, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులకు రూ.4వేలు, దివ్యాంగులు, క్షయ వ్యాధిగ్రస్తులకు రూ.6వేలు, పూర్తి అంగ వైకల్యం కలిగిన వారికి రూ.15వేలు, కిడ్నీ, లివర్, బైలేట్రల్ ఎలిఫెంటాసిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల బాధితులకు రూ.10వేలు సంభందిత లబ్దిదారులకు అందజేయనున్నట్లు తెలిపారు. తొలిరోజే 99 శాతం పంపిణీ పూర్తి చేయాలని చెప్పారు. రెండోరోజుకూ నూరుశాతం పంపిణీ చేయాలని పేర్కొన్నారు.

ఎంపిడిఒ బి శ్రీనివాసరెడ్డి

పిహెచ్‌సిలో విచారణ చేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ బృందం

ఆరోగ్య కేంద్రంలో అధికారుల విచారణ

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ నెల 26న డాక్టర్ బాలరాజుపై ఫార్మసిస్టు వెంకటప్రసాద్ దాడి చేసిన ఘటనపై అధికారులు, పోలీసులకు అందిన ఫిర్యాదులపై డిఎం అండ్‌హెచ్‌ఒ విజయమ్మ ఆదేశాలతో ఇమ్యూనిటీ ఆఫీసర్ టి వెంకటేశ్వర్లు మంగళవారం విచారణ చేపట్టారు. అయితే ఆరోగ్య కేంద్రంలో విచారణ జరుగుతున్న సమయంలోనే ప్రజా ఆరోగ్య వైద్య సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

పౌర సరఫరాలు

నిఘా వ్యవస్థ మెరుగుదలకు కృషి

జేసీ ఆర్.గోపాలకృష్ణ

మాట్లాడుతున్న జేసీ ఆర్.గోపాలకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్టం, పౌర సరఫరాల నిఘా వ్యవస్థ మెరుగుదలకు కృషి చేస్తున్నట్లు సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. స్థానిక మీకోసం సమావేశ మందిరంలో మంగళవారం పౌరసరఫరాల వ్యవస్థ, పౌరసరఫరాల నిఘా వ్యవస్థ మెరుగు పడటానికి అవసరమైన సూచనలు సలహాలు స్వీకరించడానికి మేధోమథనం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ పౌర సరఫరాల వ్యవస్థ పనితీరు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు నాణ్యమైన సరుకులు పంపిణీ చేయాలన్నారు. ధాన్యం, కందుల సేకరణ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మండల లెవెల్ స్టాక్ పాయింట్స్ నిర్వహణ మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి ఉదయభాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ ఆదేశాల మేరకు ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఆయా రంగాల్లో మంచి మార్పులకు అమూల్యమైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. పౌర సరఫరాల పంపిణీలో మెరుగైన సేవలు అందించటానికి తగిన సూచనలు ఇవ్వాలని కోరారు. వివిధ వర్గాలు చెప్పిన అభిప్రాయాలపై సవివరమైన నివేదిక తయారుచేసి రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ అందజేస్తామన్నారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, ఒంగోలు, కనిగిరి రెవెన్యూ డివిజనల్ అధికారులు జివి సుబ్బారెడ్డి, జాన్ ఇర్విన్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్, విజిలెన్స్ పౌరసరఫరాల డిప్యూటీ కలెక్టర్, జిల్లా విద్యాధికారి డి.సుభద్ర, సహాయ సరఫరాధికారి పుల్లయ్య, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమం, బిసి సంక్షేమ అధికారులు, రేషన్ డీలర్ల సంఘం, రైస్ మిల్లర్ల సంఘం, ఎండియుల సంఘం, రైస్ మర్చంట్స్ సంఘం, దాల్ మిల్లుల సంఘం, జిల్లా వినియోగదారుల సలహా మండలి సభ్యులు, టీచర్లు, అంగన్వాడీ వర్కర్లు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, వివిధ మండలాల నుండి ఎంపిక చేసిన రేషన్ కార్డుదారులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా: ప్రజాపంపిణీ వ్యవస్థ మరింత బలోపేతం చేయడానికి వ్యవస్థలన్నీ కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు అన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ వారి ఆదేశాల మేరకు ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు వివిధ సంస్థలు, రైతులు, వినియోగదారుల నుండి ప్రజాభిప్రాయ సేకరణ మంగళవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఇ.బి. విలియమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో సుమారు 60 సంవత్సరాల నుండి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు నిత్యావసర వస్తువులు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి జి.రవీంద్రబాబు, జిల్లా తూనికల కొలతల శాఖ అధికారి పి.లిల్లీ, ఫుడ్ సేఫ్టీ అధికారి దేవరాజ్, సోషల్ వెల్ఫేర్ డిడి రాజ్ దెబోరా, జిల్లా సహాయ పౌర సరఫరాల అధికారి కె.సత్యమంగళాంబ, డిసిపిసి కన్వినర్, డిప్యూటీ తహశీల్దార్లు, ఫుడ్ ఇన్స్పెక్టర్లు, బాపట్ల వినియోగదారుల సంఘం అధ్యక్షులు పిసి సాయిబాబా , రేషన్ డీలర్లు, ఎమ్.డియు ఆపరేటర్లు, రైతులు, వివిధ శాఖల అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లాలో తహశీల్దార్ల బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు వెళ్లి బాపట్ల జిల్లాకు తిరిగి వచ్చిన పలువురు తహశీల్దార్లను జిల్లాలోని వివిధ మండలాల తహశీల్దార్లుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఆ వివరాలు..

మండలం	తహశీల్దార్ పేరు
అద్దంకి	జి.శ్రీచరణ్
సంతమాగులూరు	కె.రవిబాబు
అమృతలూరు	కె.నెహ్రూ బాబు
కొల్లూరు	బి.వెంకటేశ్వర్లు
చుండూరు	డి.మల్లికార్జునరావు
వేమూరు	బి.సుశీల
మార్టూరు	టి.ప్రశాంతి
యద్దనపూడి	కె.రవికుమార్
బాపట్ల	పి.కృష్ణకాంత్
పిట్టలవానిపాలెం	పి.మెహర్‌కుమార్
చీరాల	కె.గోపికృష్ణ
వేటపాలెం	పి.పార్వతి
చినగంజాం	జె.ప్రభాకర్ రావు
కోరిశపాడు	డి.వెంకటేశ్వరరావు
పర్చూరు	పి.బ్రహ్మయ్య
కారంచేడు	కె.నరసింహారావు
కర్లపాలెం	ఎస్.వెంకటరత్నం
కలెక్టరేట్ సూపరింటెండెంట్	జివి.సుబ్బారెడ్డి
కలెక్టరేట్ సూపరింటెండెంట్	పి.సీతారత్నం
కలెక్టరేట్ సూపరింటెండెంట్	డి.నాగరాజారావు,
లాండ్ సెక్షన్	డి.కవిత,
భూసేకరణ విభాగం	కె.సంధ్యశ్రీ

బాపట్ల ఆర్డీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గా ఏ శ్రీనివాసరావు, ఆర్డిఓ రేపల్లె కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పి జాన్ పీటర్, చీరాల ఆర్డీవో కార్యాలయ డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పి.సురేష్‌బాబును నియమించారు.

హామీలకు కట్టుబడి ఉన్న ప్రభుత్వం

- వైసిపి అసత్య ప్రచారాలు గమనిస్తున్న ప్రజలు
- టిడిపి జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ వెల్లడి

మాట్లాడుతున్న బాలాజీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టిడిపి జిల్లా అధ్యక్షులు డాక్టర్ నూకసాని బాలాజీ తెలిపారు. స్థానిక భాగ్య నగర్‌లోని టిడిపి జిల్లా కార్యాలయంలో మంగళ వారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన ప్రతిపక్ష హోదాను కూడా ప్రజలు తిరస్కరించినా బుద్ధి రాని వైసిపి నేతలు సూపర్ సిక్స్ పథకాలు అమలు కావని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. సూపర్ సిక్స్ పథకాలే కాకుండా ప్రజలకు అవసరమైన అనేక పథకాలను అమలు చేయటానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం 600కు పైగా సలహాదారుల పేరుతో ఒకే సామాజిక వర్గం వారికి పెద్ద పీట వేసిన చరిత్ర ఉన్నా కుల రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఐదేళ్లలో 25 లక్షల పక్కా గృహాలు కట్టిస్తానని ప్రగల్భాలు పలికిన జగన్మోహన్‌రెడ్డి పూర్తి చేసిన గృహాలు కేవలం ఐదు లక్షలు మాత్రమేనని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఐదున్నర లక్షల ఇళ్లను సకాలంలో నిర్మించకపోవడంతో వాటిని రద్దు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అర్హులైన నిరుపేదలందరికీ శాశ్వత గృహ వసతి కల్పించే కార్యక్రమంలో భాగంగా ఒక ఏడాదిలో 8.25 లక్షల గృహాలను పూర్తి చేయాలని నిర్ణయించిందన్నారు. గత ప్రభుత్వంలో పూర్తయిన ఎన్టీఆర్ గృహాలకు బిల్లులను ఇవ్వకుండా ఆపివేశారని, వారందరికీ బిల్లులను చెల్లించాలని సిఎం ఆదేశించారన్నారు. 2014-2019 కాలాన్ని 2019-2024 కాలంతో పోలిస్తే గత వైసిపి ప్రభుత్వం ప్రజలకు పదివేల కోట్ల వరకు అన్యాయం చేసిందన్నారు.

బీచ్‌లలో ప్రమాదాలు జరగకుండా

ముందస్తు చర్యలు చేపట్టాలి..

కలెక్టర్ వెంకట మురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బీచ్‌లలో ప్రమాదాలు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి తెలిపారు. బీచ్‌ల వద్ద ప్రమాదాల నివారణపై జిల్లా స్థాయిలో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. బీచ్ లు ఆహ్లాదకరంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. 103 కిలోమీటర్ల పొడవున బాపట్ల జిల్లాలో సముద్ర తీరం విస్తరించి ఉందన్నారు. ముఖ్యంగా సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్ లు ప్రాచుర్యం పొందాయన్నారు. బీచ్ వద్ద ప్రజలు మునగడానికి హద్దును సూచిస్తూ హెచ్‌పిడిపి పైపులను ఏర్పాటు చేయాలన్నారు. ఒక బీచ్ వద్ద పైలట్‌గా ప్రారంభించాలని, మంచి ఫలితాలు వస్తే అన్ని బీచ్ లలో ఏర్పాట్లు చేయాలన్నారు. 39 రిసార్ట్ లు నడుస్తున్నాయని చెప్పారు. కార్తిక మాసంలో ఇక్కడ అత్యధికంగా పర్యాటకులు వస్తుంటారని వివరించారు. పేరలి వద్ద బోట్ షికార్ కొరకు ప్రత్యేక బోట్లు, భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. శని, ఆదివారాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కొక్క బీచ్ వద్ద 25 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు, అదనపు ఎస్పీ విఠలేశ్వరరావ్, చెన్నైకి చెందిన తీర పరిశోధన జాతీయ కేంద్రం, షోర్‌లైన్ మేనేజ్‌మెంట్ ప్లానర్ బి. సుధీర్, ఆర్డీవోలు, అనుబంధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకుంటాం

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

'ఆక్రమణల చెరలో రాళ్లవాగు' శీర్షికన ఈ నెల 29న ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఇన్‌ఛార్జి తహశీల్దార్ యు.విజయభాస్కర్ ఆక్రమణ జరిగిన ప్రదేశాన్ని తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. బేస్‌మట్టాలు నిర్మించుకున్న వారితో మాట్లాడారు. వారి పట్టాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996లో అప్పటి రెవెన్యూ అధికారులు కొందరికి పట్టాలు ఇచ్చినట్లు బేస్‌మట్టాలు నిర్మించుకున్న వారు చూపారన్నారు. రాళ్లవాగు ఆక్రమణ జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

నిధులు విడుదలైన వెంటనే కూలీలకు జమ

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

'చేతనం అందక..పూట గడవక' శీర్షికతో ప్రజాశక్తి దినపత్రిలో ఈనెల 29వ తేదిన కథనం ప్రచురితమైంది. దీనికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అర్జునరావు స్పందించారు. ఏడాది మే 20వ తేది వరకు అప్‌లోడ్ అయిన ఎఫ్‌టివోలు మాత్రమే కూలీల ఖాతాకు నగదు జమైనట్లు సిఆర్‌డి వారు తెలియజేసినట్లు చెప్పారు. మే నెల 21 నుంచి అప్‌లోడ్ అయిన ఎఫ్‌టివోలు మాత్రం కూలీల ఖాతాకు నగదు జమ కావాల్సి ఉందని తెలిపారు. నిధులు విడుదలైన వెంటనే కూలీల ఖాతాకు నేరుగా నగదు జమ అవుతాయని ఆయన చెప్పారు.

అనుమతి లేని పాఠశాల మూసివేత

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-గిద్దలూరు

ఈ నెల 25న ప్రజాశక్తిలో ప్రచురితమైన 'నోటీసులు సరే..చర్యలు తీసుకోవాలి' అనే వార్తకు విద్యాశాఖ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. స్ప్రింగ్ బోర్డ్ పాఠశాల వాళ్లు ఇండో స్కూల్ పేరు మీద అనుమతులకు మించి.. 8 నుండి 10 తరగతులు నిర్వహిస్తుండగా విద్యాశాఖ అధికారులు అక్కడికి వెళ్లి.. స్కూల్ అనుమతులు తీసుకొనే వరకు తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ప్రకటించారు.

మాదక ద్రవ్యాల నివారణకు

సమన్వయంతో పనిచేయండి

- అందుబాటులో లేకుండా చూడాలి
- రాష్ట్ర బాలల హక్కు పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బాలలు మాదకద్రవ్యాలు వినియోగించకుండా, అవి వారికి అందుబాటులో లేకుండా వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. ప్రకాశం భవనంలో "బాలలలో మాదక ద్రవ్యాల వినియోగం అక్రమ రవాణా కట్టడి"కి సంయుక్త కార్యాచరణ ప్రణాళిక అమలుపై మంగళవారం కలెక్టర్ .ఏ తమీమ్ అన్సారియా అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమీక్షా సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ విద్యా సంస్థలు, ఇతర బహిరంగ ప్రదేశాలలో ఏ రూపంలోనూ మాదక ద్రవ్యాలు వారికి అందుబాటులో లేకుండా చూడాలని స్పష్టం చేశారు. వీటికి అలవాటు పడిన వారిని వాటి నుంచి విముక్తి కల్పించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత సంబంధిత విభాగాలపై ఉందన్నారు. ఈ దిశగా తీసుకుంటున్న చర్యలపై ఆయా శాఖల వారీగా ఆమె సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా విద్యా సంస్థలు, హాస్టళ్లు, గిరిజన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగంతో ఆరోగ్యం, సామాజికంగా ఎదురయ్యే అనర్థాలను వారికి వివరించాలన్నారు. జువైనల్ జస్టిస్ చట్టంపై వారికి అవగాహన కల్పించాలన్నారు. అనాథలుగా ఉన్న పిల్లలు మాదక ద్రవ్యాల బారినపడి నేరాలకు పాల్పడుతున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. నేరరహిత, డ్రగ్స్ రహిత జిల్లాగా ప్రకాశం జిల్లాను తీర్చిదిద్దేలా కృషి చేయాలని ఆమె పిలుపు నిచ్చారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ బయటి పిల్లలతో పాటు విద్యాసంస్థల్లో ఉంటున్న వారు కూడా మాదక ద్రవ్యాలను వినియోగిస్తున్న సంఘటనలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. హాస్టళ్లలోని పిల్లల ప్రవర్తనను వార్డెన్లు నిశితంగా గమనిస్తుండాలని ఆమె ఆదేశించారు. ఈ దిశగా పర్యవేక్షించాలని ఆయా శాఖల ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలను తెలియజేసేలా రూపొందించిన పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో ఐసిడిఎస్ పీడీ కె. మాధురి, బాలల సంక్షేమ కమిటీ సభ్యురాలు నీలిమ, డిపిపిఒ దినేష్ కుమార్, ఏఎస్‌పి ఎస్‌వి శ్రీధర్ రావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి జగన్నాథరావు, బిసి. సంక్షేమ అధికారి అంజల, వికలాంగుల సంక్షేమ అధికారి జి. అర్చన, మైనారిటీ సంక్షేమ అధికారి నారాయణ, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.సురేష్ కుమార్, డిఈఒ సుభద్ర, డ్రగ్స్ నివారణ శాఖ సహాయ సంచాలకులు జ్యోతి, కార్మికశాఖ సహాయ సంచాలకులు అనిత, జెజెబి సభ్యురాలు మసుధ, డిస్ట్రిక్ట్ ప్రొబేషన్ ఆఫీసర్ బాలప్రభాకర్ . ఎక్సైజ్. ఆర్‌పిఎఫ్, ఇంటర్మీడియట్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పద్మావతి